

బొమ్మరిల్లు

సంపాదకుడు: విజయ బాపినీడు

త్రాగుడన్నది చెడ్డ అలవాటు. దీనివల్ల మనసుకు శాంతి అనేది ఉండదు. ఆరోగ్యం చెడుతుంది. కుటుంబంలో కలహాలకు దారితీస్తుంది. దేశంలో త్రాగుబోతుల సంఖ్య పెరిగిపోతోందనీ, దీన్ని అరికట్టాలన్న ఉన్నతాశయంతో ప్రభుత్వం సారా కొట్టుల్ని మూసివేసినంత మాత్రాన తాగుడు ఆగిపోదు. ఎవరో, ఎక్కడో ఒకచోట దొంగతనంగా సారా కొట్టుల్ని తెరిచి అమ్ముతూనే ఉంటారు. 'ఇంట గెలిచి, రచ్చ గెలవాలి' అన్నట్లు ప్రజలు తమ ఇళ్ళలో త్రాగేవారుంటే, మంచితనంగా వారి మనస్తత్వాలను మార్చి, ఈ అలవాటును మాన్పింపజేస్తే, ఎన్ని సారా కొట్లు తెరిచినా వాటంతటవే మూతబడిపోతాయని ఈ సంచికలో రచయిత శ్రీ బూర్లె నరసింహశాస్త్రిగారి కథ చదివితే 'తప్పెవరిది' అని తెలుస్తుంది!

సంపుటి: 23 మే 1994 సంచిక: 7

విడిప్రతి: రూ. 4-00 సంవత్సర చందా: రూ. 48-00

ప్రజల గొప్ప

కోసల రాజ్యాన్ని పరిపాలించే విక్రమ సింహుడి వద్దకు పొరుగుదేశపు కళాకారులు ప్రదర్శనకు అనుమతి కోరారు. రాజు సరే నన్నాడు.

మొదటిరోజు కళాకారుల ప్రదర్శనకు కొద్దిగా జనం వచ్చారు. రెండో రోజుకు బొత్తిగా జనం లేరు.

కళాకారులు విక్రమసింహుడిని కలుసుకుని, "ప్రభూ! మీ రాజ్యంలో కళలకు ఆదరణ లేదు. మాకు సెలవిప్పించండి" అన్నాడు.

రాజు సరేనని వారికి పదివేల బంగారు నాణేలు కానుకగా ఇచ్చి, "మీ ప్రదర్శన నా కెంతో సంతోషాన్నిచ్చింది. అందుకే ఈ చిరు కానుక" అన్నాడు.

కళాకారులాశ్చర్యపడి, "మా దేశంలో ఏడాది పాటు ప్రదర్శించినా మా కళలకింత డబ్బు రాదు. మహాప్రభూ! మీరు చాలా గొప్పవారు" అని మెచ్చుకున్నారు.

"గొప్పతనం నాది కాదు. నా ప్రజలది. వాళ్ళు అహర్నిశలు శ్రమించథంవల్లనే నేను మీవంటి వారికిలా కానుకలివ్వ గల్గుతున్నాను" అన్నాడు విక్రమసింహుడు.

అప్పటికి కళాకారులు నిజం గ్రహించి, "రాజు గొప్పతనం ప్రజల గొప్పతనంలోనే ఉంది. మీ ప్రజలు నిజంగా చాలా గొప్పవారు" అని ఆయన వద్ద సెలవు తీసుకున్నారు.

—పి. ఎం. సుందరరావు



భారత వ్యాపారానికి డుంకెల్ సంకెల

మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ దేశాల్లో వ్యాపారం దిగజారింది. అందుకు ఒక్కటే పరిష్కార మార్గముంది. అదేమిటంటే వ్యాపారం ఏ దేశానికాదేశానికే పరిమితం కాకుండా దేశ దేశాలమధ్య కొనసాగాలి. ఈ విషయమై ప్రపంచ దేశాలొక నిర్ణయానికి చేరుకునేలోగా రెండవ ప్రపంచ యుద్ధం కూడా జరిగింది.

ఆ తర్వాత 1947లో GATT అనే సంస్థ ఏర్పడింది. జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్స్ అండ్ ట్రేడ్ దీని పూర్తి పేరు. దిగుమతి సుంకాల విషయంలోనూ, వ్యాపార సంబంధాల విషయంలోనూ దేశ విదేశాల మధ్య నియమాలు, షరతులు ఏర్పాట్లు చేయడానికి జెనీవాలో మొదటి సమావేశం జరిగింది. అందులో 45,000 రకాల వస్తువులపై దిగుమతి సుంకం తగ్గి, పది బిలియన్ డాలర్ల ప్రపంచ వ్యాపారానికి సహకరించింది. ఆ తర్వాత ది అన్నెసీ, టార్క్వే జెనీవా, డిల్లన్, కెన్నెడీ, టోక్యోలలో మరో ఆరు సమావేశాలు జరిగి ప్రపంచ వ్యాపారాభివృద్ధికి బాగా సహకరించాయి. 1979లో టోక్యోలోని సమావేశం తర్వాత ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో కొన్ని మార్పులు వచ్చాయి.

ప్రముఖ సంపన్న దేశమైన అమెరికాలో వ్యాపార పరిస్థితులు బాగా దిగజారాయి. జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ వంటి ఆసియా దేశాల నుంచీ, కొన్ని లాటిన్ అమెరికా దేశాల నుంచీ పారిశ్రామిక ఉత్పత్తి విషయంలో అమెరికా తట్టుకోలేనంత గట్టి పోటీని ఎదుర్కోవలసి వచ్చింది. అమెరికాలో నిరుద్యోగ సమస్య ప్రబలింది. వ్యవసాయోత్పత్తిలో యూరప్ దేశాల ధాటికి తట్టుకోవడమూ అమెరికాకు కష్టంగానే ఉంది.

ఈ సమస్య పరిష్కరించడానికి అమెరికాకు GATT సమావేశం ఒక్కటే ఉపాయంగా

ఈ శతాబ్దపు చివరి దశాబ్దం

తోచింది. 1986లో ఉరుగ్వేలో జరిగిన ఈ సమావేశంలో అమెరికా కొన్ని క్రొత్త ప్రతిపాదనలు చేసింది. అదేమిటంటే యూరోపులో వ్యవసాయదారులకు సబ్సిడీ తగ్గించడం, అమెరికన్ వ్యవసాయోత్పత్తికి యూరప్‌లో ప్రవేశం కల్పించడం, పేటెంటు చేయబడిన వినియోగ వస్తువులకు రక్షణ కల్పించడం వగైరాలు.

ఈ ప్రతిపాదనలు యూరోపుకు మాత్రమే పరిమితం కావు. భారత దేశాని కిందులో కొన్ని ఇబ్బందులున్నాయి. పేటెంటు చేయబడిన వినియోగ వస్తువులకు రక్షణ కల్పిస్తే, వ్యవసాయదారుల విత్తనాలు, సామాన్యులు వాడే మందులు, అందుబాటులో లేనంతగా ధరల విషయంలో పెరిగిపోతాయి. వ్యవసాయదారులకు సబ్సిడీలు తొలగించడంలో ఎన్నో రాజకీయ ఇబ్బందులున్నాయి.

యూరోపులో వ్యవసాయ సబ్సిడీలు తగ్గిస్తే అక్కడి ఆహారపదార్థాల విలువ పెరిగి అమెరికా తన ఉత్పత్తులలో వారితో పోటీకి తట్టుకో గల్గుతుంది. అప్పుడు ధరకాక, నాణ్యత మాత్రమే ప్రధానమవుతుంది. ఇందుకు ఫ్రాన్స్ దేశం ప్రతిఘటించగా సమావేశపు సంప్రదింపులు స్థంభించిపోయాయి. 1991 చివర్లో అప్పటి GATT డైరెక్టరు జనరల్ ఆర్థర్ డుంకెల్ కొన్ని సవరణలతో ఒక ప్రతిపాదన తీసుకుని రాగా 1992 మే నెలలో యూరప్ కూడా అందుకంగీకరించింది. అప్పటికీ భారతదేశంలో వరుసగా ప్రభుత్వాలు మారుతూ రాజకీయ స్థిరత్వం లేకుండా పోయి ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. బడుగు దేశాలకు వత్తాసుగా ఉండే సోవియట్ సంయుక్త రాష్ట్రాలు ముక్కలు ముక్కలై పోవడంలో భారతదేశపు ప్రతిఘటన శక్తి మరింతగా క్షీణించింది.

1993 డిసెంబరు మధ్యలో పలు సంపన్న దేశాలు, అభివృద్ధి చెందుతున్న భారతదేశం వంటివీ, పేదదేశాలూ మొత్తం 117 సభ్యత్వ దేశాలు డుంకెల్ ప్రతిపాదనలపై సంతకం చేశారు. అందువల్ల భారతదేశపు వ్యాపారం 1.5 నుంచి 2.0 బిలియన్లు డాలర్ల దాకా అభివృద్ధి చెందుతుందనీ, వ్యవసాయదారుల కిబ్బంది ఉండదనీ, సామాన్యుడి కవసరమయ్యే మందుల ధరలు పెరగవనీ భారత ప్రభుత్వం భావిస్తూంటే - సంపన్న దేశాలే దీనివల్ల ఎక్కువ ప్రయోజనం పొందుతాయని పలువురు ఆర్థిక శాస్త్ర నిపుణులంటున్నారు. భారత వ్యాపారానికి డుంకెల్ సంకెలలు పడ్డాయి. అవి సంకెలలు కాదనీ మురుగులనీ భవిష్యత్తు ఋజువు చేయగలదని ఆశిద్దాం!

"వసుంధర"



నిజాయితీ

రంగయ్య కిరాణా వ్యాపారి. పంటలు బాగా పండినపుడు సరుకులు చౌకగా కొని, పండనపుడు వాటినే తిరిగి అధిక ధరలకు అమ్ముతూ ఆయన చాలా డబ్బు కూడబెట్టాడు. అయినా ఇంకా ఆయనకు ధన వ్యామోహం తగ్గలేదు.

గంగ రంగయ్యింట్లో పని మనిషి. ఎంతో నమ్మకంగా ఎన్నో యేళ్ళనించి పని చేస్తోంది. ఒక రోజున దాని కొడుక్కి జబ్బు చేసింది. వైద్యుడు నూరు వరహాలు కావాలన్నాడు. గంగవద్ద ఎర్రని ఏగానీ కూడా లేదు. అది రంగయ్యని అప్పడిగింది. ఆయన ఇవ్వను పొమ్మన్నాడు. గంగ దేవుడిమీద భారం వేసి అప్పటికి ఊరుకుండిపోయింది.

ఆరోజే రంగయ్య పొరుగూరు వెళ్ళాడు కాలి నడకన. తొందరగా పని పూర్తి చేసుకుని తిరిగి వస్తూండగా ఆయన కాలికో ఎర్రకాగితం పొట్లాం తగిలింది. ఎమిటా అని చూస్తే ఆ పొట్లాంలో బంగారు గొలుసుంది.

ఆ గొలుసు నాలుగు పేటలది. నాలుగు కాసులకు తక్కువుండదు. ఎవరో అజాగ్రత్తతో పారేసుకున్నారు. అదృష్టంకొద్దీ తనకిది దొరికిందనుకున్న రంగయ్య ఒకసారి చుట్టూ చూసి చటుక్కున ఆ పొట్లాన్ని జేబులో వేసుకున్నాడు. తననెవరూ గమనించక పోవడం ఆయనకెంతో ఆనందాన్ని కలగజేసింది.

రంగయ్య ఊళ్ళోకి వచ్చేసరికి జగన్నాథమనే ఆసామీ ఇంటిముందు జనం మూగి ఉన్నారు. సంగతేమిటని అడిగేడాయన.

కూతురి పెళ్ళికని జగన్నాథం నాలుగుపేటల బంగారు గొలుసు చేయమని పొరుగూరి కంసాలికి పురమాయించాడు. ఈరోజది తెచ్చుకుంటూంటే దారిలో ఎక్కడో పడిపోయింది. ఆ గొలుసు లేకపోతే పెళ్ళి ఆగిపోతుంది. ఇంకో గొలుసు చేయిద్దామంటే జగన్నాథం దగ్గర డబ్బులేదు.

అలాంటి పరిస్థితుల్లో జగన్నాథం గొలుసు వెనక్కిచ్చేయాలని మనసు పీకింది రంగయ్యకు. అయినా చేతికి చిక్కిన గొలుసును చూస్తూ

ంటి సుబ్రహ్మణ్య శర్మ

చూస్తూ వదులుకోలేక పోయాడాయిన.

అక్కడేమీ అనకుండా ఇంటికి వెళ్ళాడు రంగయ్య. భార్యకు గొలుసు విషయం చెప్పాలా, కూడదా అని తటపటాయిస్తూండగా భార్య ఆయనతో, "ఈ రోజొక విచిత్రం జరిగింది చెప్పనా?" అంది.

"లాభమైతే చెప్పు. నష్టమైతే చెప్పకు" అన్నాడు రంగయ్య.

"అబ్బ, మీకెప్పుడూ లాభం గురించిన ఆలోచనలే! అయినా ఇది లాభమేలెండి. నాచేతి వ్రేలికున్న ఉంగరం కొద్దిగా వదులయినట్లుంది - ఊరగాయ జాడీలో పడిపోతే నేను చూసుకోలేదు. జాడీలో కొద్దిగా మిగిలిపోయిన ఊరగాయను గంగను తీసుకోమని జాడీ కడిగేయమన్నాను. కాసేపటికది ఉంగరం తీసుకుని వచ్చి నాకిచ్చింది. అదిచ్చేదాకా నాకా ఉంగరం విషయమే గుర్తుకు రాలేదు. గంగ చాలా గొప్ప మనిషి. కొడుకు వైద్యానికి డబ్బు కావాలని కూడా దొంగతనానికి కక్కుర్తి పడలేదు" అంటూ రంగయ్యకు భార్య జరిగిన విశేషం చెప్పింది.

ఈ మాటలు వినగానే రంగయ్యకెవరో చెంప ఛెళ్ళుమనిపించినట్లయింది. డబ్బు అవసరంలో ఉండి కూడా తనకు దొరికిన వస్తువును యజమానికప్పగించిన పేదరాలు గంగ నిజాయితీ - ఏ అవసరమూ లేకపోయినా దొరికిన నగను స్వంతం చేసుకోవాలన్న ఆయన దుర్బుద్ధిని అపహాస్యం చేస్తోంది.

రంగయ్య వెంటనే జనన్నాధం ఇంటికి వెళ్ళి తనకు నగ దొరికిందని చెప్పి ఆయనకు తిరిగిచ్చి, పెళ్ళికయ్యే ఖర్చుల్లో తన సాయం కావాలంటే అడగమని చెప్పాడు

అంతేకాదు!

ఆయన గంగ కొడుక్కి స్వంత ఖర్చుతో వైద్యం చేయించాడు.

ఒకరి నిజాయితీ మనసుకు తృప్తినివ్వడమేకాక ఇంకొకరిలో నిజాయితీని ప్రవేశపెడుతుందని పనిమనిషి గంగ నిరూపించిందా విధంగా!



దెయ్యాలకు దెయ్యం

రామాపురంలో సోమయ్య అనే పేద రైతున్నాడు. వాడు భాగ్యవంతుల పొలాన్ని కౌలుకు తీసుకుని ఆ వచ్చే రాబడితో రోజులు గడుపుతున్నాడు.

సోమయ్య భార్య గయ్యాళిది. ఉన్నదానితో సరిపెట్టుకోవడం మాటటుంచి లేనిపోని గొంతెమ్మ కోర్కెలతో భర్తను వేధించేది. సోమయ్య అవి తీర్చడం తనవల్ల కాదనేవాడు. అప్పుడామె నాతండ్రి నన్ను నీలాంటి వాడికి కట్టిబెట్టి నాగొంతు కోశాడు అని ఏడ్చేది. తన భర్త గురించి ఇరుగుపొర్గుగులవద్ద కూడా తిట్టేది.

సంసారంలో సుఖ శాంతులు లేక జీవితమంటే విరక్తి చెందిన సోమయ్య ఒకరోజున ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. ఊరిప్రక్క అడవిలో మర్రిచెట్టు కొమ్మకు ఉరిత్రాడు తగిలించి మెడకు బిగించకోబోతూండగా, "ఆగు!" అన్న మాటలు వినిపించాయి.

ఉలిక్కిపడిన సోమయ్య అటు తిరిగి వికార రూపంలో ఒక దెయ్యాన్ని చూసి, "ఉత్తప్పుడైతే నేను నిన్ను చూసి హడలి చచ్చేవాణ్ణి. ఇప్పుడు నేనెలాగూ చావాలనుకుంటున్నా, నీకాకలిగా ఉంటే నన్ను మింగు" అన్నాడు.

"నువ్వెందుకు చావాలనుకుంటున్నావో ముందు నాకు చెప్పు" అంది దెయ్యం.

సోమయ్య తనకథ చెప్పుకున్నాడు, "నీ బాధ నాకు బాగా అర్థమయింది. నా దగ్గర కొన్ని ఆభరణాలున్నాయి. తీసుకొని వెళ్ళి నీ భార్యకిచ్చి సుఖంగా ఉండు" అంటూ దెయ్యం వాడికి ఒకమూట తెచ్చిచ్చింది.

ఆ మూట తీసుకుని సోమయ్య ఇంటికి వెళ్ళి భార్యకు దెయ్యమిచ్చిన నగలన్నింటినీ చూపించాడు. వాడి భార్య ఎంతో సంతోషించి, సోమయ్యను మెచ్చుకుంది.

కానీ సోమయ్య సంతోషం ఎంతోసేపులేదు. మర్నాడే వాడి భార్య "ఆ దెయ్యం దగ్గర ఇంకా బోలెడు నగలుంటాయి. దాన్ని మెప్పించి అవన్నీ తీసుకురా" అంటూ వేధించసాగింది.

నేమాని శ్రీనివాస్

సోమయ్య భార్యకు పలువిధాల నచ్చజెప్పడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. చివరకు వాడు భార్య చూడకుండా నగల మూట తీసుకుని మళ్ళీ అడవిలోని మర్రి చెట్టు క్రిందికి వెళ్ళి మెడకు ఉరిపోసుకున్నట్లు నటించాడు.

అప్పుడు దెయ్యం వాడిముందు వాలి "ఏం, మళ్ళీ వచ్చావు?" అంది. సోమయ్య దెయ్యానికి జరిగింది చెప్పాడు. అయితే ఏం చేద్దామనుకుంటున్నావ్?" అంది దెయ్యం.

"ఏం చేస్తాను? నీవు మనుషులకు దెయ్యం. నా భార్య దెయ్యాలకే దెయ్యమై పట్టుకునేలాగుంది. ఈ ఆభారణాలతో తృప్తిపడని దానికి జీవితంలో దేనికీ తృప్తి ఉండదు. అందుకే నీ ఆభరణాలు నీకు వెనక్కిచ్చేయాలని తీసుకొచ్చాను. నా భార్యని లెక్క చేయను. చెప్పిన మాట వినకపోతే దేహ శుద్ధి చేస్తాను" అన్నాడు సోమయ్య ఈ మాట వింటూనే - "అయ్యో!" అంటూ దెయ్యం నేలమీద చతికిలబడి ఏడ్వసాగింది. "నువ్వెందుకేడుస్తావు?" అన్నాడు సోమయ్య అశ్చర్యంగా.

నేనూ ఒకప్పుడు మనిషినే. నాకూ ఒక గయ్యాళి భార్య ఉండేది. దానిపోరు పడలేక ఈ చెట్టుక్రింద ఆత్మహత్య చేసుకోబోతే ఒక దెయ్యం వచ్చి నాకు ఆభరణాలనిచ్చి పంపింది. నా భార్య కూడా నీ భార్యలాగే దెయ్యాలకే దెయ్యమయి మళ్ళీ నన్ను అడవిలోకి పంపింది. నేను దాన్ని మళ్ళీ ఆభరణాలు కావాలని అడిగాను. అంతే! ఆ దెయ్యానికి జన్మ విముక్తి కలిగి నాకు దెయ్యం రూపు వచ్చింది. ఈ రోజు నువ్వు కూడా రెండోసారి నగలు కావాలని ఉంటే నా దెయ్యం రూపు నీకు వచ్చేది. నాకు జన్మ విముక్తి కలిగేది. ఆ అవకాశం పోయిందని ఏడుస్తున్నాను" అంది దెయ్యం. సోమయ్య పరుగు లంకించుకుని, "పెళ్ళాన్ని దెయ్యాలకు దెయ్యం కానిస్తే మగడు దెయ్యం కాక తప్పదన్నమాట! అమ్మో! వెంట్రుక వాసిలో ప్రమాదం తప్పింది. ఇకమీదట నా భార్యను పూర్తి అదుపులో ఉంచాలి" అనుకున్నాడు.





13

(గత సంచిక తరువాయి)

పాండవులూ ఆ మాట విని ఖేదపడుతూండగా ఘటోత్కచుడు తండ్రులారా! పూజ్యులైన శల్య రాజేంద్రుల వారెక్కడ ఉండినా మన శ్రేయస్సునే కోరుతూ ఉంటారు. భవిష్యత్తులో ఆ సంగతి మీకు స్పష్టంగా తెలుస్తుంది. కపటంగా తనను వంచించిన దుష్ట దుర్యోధనునికి తగిన సమయంలో తగిన విధంగా బుద్ధి చెప్పటానికి తాతగారు తప్పకుండా ప్రయత్నించి కృత కృత్యులవుతారు. మీరు ఆందోళన పడకండి? అన్నాడు.

కృష్ణుడు పాండవులను ఉత్తేజపరుస్తూ "అవును ఘటోత్కచుడు చెప్పింది వాస్తవమే? శల్య బాబాయిగారు మన పక్షంలో ఉండి చెయ్యగలిగిన దానికంటె, శత్రుపక్షంలో ఉండే మనకు ఎక్కువ సాయం చెయ్య గలుగుతారు." అన్నాడు.

అనంతరం ధర్మరాజు వేగులకు తగిన బహుమతులనిచ్చి "ఇప్పటినుంచి మీ బాధ్యత పెరుగుతున్నది. కౌరవుల యుద్ధ వ్యూహాల గురించీ వాళ్ళ శిబిరాల్లో జరిగే రహస్య సమావేశాల గురించీ, ఎప్పటికప్పుడు వార్తలను సేకరించి తెలియజేస్తూ ఉండండి" అన్నాడు.

గూఢచారులు అందరికీ ప్రణామాలు చేసి అక్కణ్ణుంచి వెళ్ళిపోగానే కృష్ణుడు ధర్మరాజుతో "బావగారూ! రాబోవు అమావాస్యను యుద్ధ దివసంగా నిర్ణయించి, కురుక్షేత్రంలో తల పడవలసిందిగా దుర్యోధనునికి వర్తమానం పంపించండి" అన్నాడు.

కృష్ణుడు సూచించినట్లుగా ధర్మరాజు అప్పటి కప్పుడే వార్తాహరుణ్ణి దుర్యోధనుని దగ్గరికి పంపించి యుద్ధ ప్రకటనను, సమయాన్ని ప్రదేశాన్ని నిర్దేశించాడు.

ధర్మక్షేత్రమని పేరుగాంచిన కురుక్షేత్రంలో

కిరణ్‌కుమారి



పాండవులు ఏడు అక్షౌహిణుల సైన్యమూ, కౌరవుల పదకొండు అక్షౌహిణుల సైన్యమూ, మొత్తం పద్దెనిమిది అక్షౌహిణులుల సైన్యం ఒకరిపై మరొకరు విజయాన్ని సాధించాలన్న పట్టుదలతో కయ్యానికి కాలు దువ్వుతూ ఎదురెదురుగా మోహరించాయి...

సర్వసేనాధిపతియైన ధృష్టద్యుమ్నుడు పాండవ సైన్యాలకు ఉత్తేజకరంగా ఉత్సాహ పూరితములైన ప్రభోధాలను చేస్తూ, సమయం కోసం ఎదురు చూడసాగాడు.

ఘటోత్కచుడు వెయ్యి రూపాలతో లక్ష కళ్లతో పాండవసేనలను జాగ్రత్తగా చూసుకుంటూ, తమ్ములైన అభిమన్యుడు, ఉప పాండవులతోనూ కృష్ణుని కుమారులైన సాంబ, ప్రద్యుమ్న, అని రుద్ధాది వీర యువకులతోనూ కలిసి ఎప్పుడెప్పుడు కౌరవ సేనలను నురుమాడుదామా అన్న ఉత్కంఠంతో నిరీక్షించసాగాడు.....

ప్రతి పక్షమైన కౌరవసేనా వాహినికి నాయకత్వం వహించిన భీష్ముడు ద్రోణ, కృప, అశ్వత్థామ కృతవర్మాది యోధులతో కలిసి తన సేనల అగ్రభాగాన నిలిచి, యుద్ధ ప్రారంభం కోసం వేచివున్నాడు.

ఆ సమయంలో —

తెల్లటి అశ్వాలను పూన్చిన రథాన్ని నడుపుకుంటూ కృష్ణుడు రెండుసేనల మధ్య ప్రదేశానికి వచ్చాడు. గాండీవధారియై, పరిపూర్ణ యోధ వేషంలో ఉన్న అర్జునుడు రథం మధ్యనుండి ఒక్కమారు కౌరవ సైన్యాన్ని పూర్తిగా చూశాడు... ఆలా చూసిన తర్వాత కృష్ణునితో "బావా! రథాన్ని ఆపు" అన్నాడు.

కృష్ణుడు రథాన్ని నిలువరించి "అర్జునా! ఇరుపక్షాల సైనికులూ, యోధులూ పరస్పర విజయం కోసం ప్రాణాలను తృణ ప్రాయంగ భావించి ఎదురొడ్డి వున్నారు. మీ అన్నగారైన యుధిష్ఠిర మహారాజు కౌరవ సేనానియైన భీష్ముల వారి యెదుటకు వెళ్లి, యుద్ధ ప్రారంభాన్ని ప్రకటిస్తూ దేవదత్తాన్ని పూరించమని ఆజ్ఞాపించారు కదా? మనమింకా భీష్ముని దగ్గరికి చేరనేలేదు. అప్పుడే రథం ఆపమని ఎందుకు చెప్పావు?" అన్నాడు.

అర్జునుడింకా కౌరవసైన్యాలనుంచి చూపులను మార్చులేదు! అతడి ముఖంలో జాలి ఆవరించింది. కళ్లు తడి అవుతున్నాయి.

కృష్ణుడు కొన్ని క్షణాలు అర్జునుడి వాలకం గమనించి "అర్జునా! ఏమిటిది? ఎందుకలా అయిపోతున్నావు?" అని ప్రశ్నించాడు.

అర్జునుడు గద్గద స్వరంతో "బావా! నేనీ యుద్ధం చేయ్యలేను. రథాన్ని వెనక్కి మళ్ళించు" అన్నాడు.

కృష్ణుడు ఉలిక్కిపడి "ఏమన్నావ్? యుద్ధం చేయ్యలేవా? రథాన్ని వెనక్కి మళ్లించాలా?.....నువ్వు స్వస్థతలో ఉండే ఈ మాటలంటున్నావా?" అన్నాడు.

అర్జునుడు విషాదయోగంలో తలమునక్కలవుతూ "బావా! ఎదుట ఎటువేపు చూసినా గురువులు, పితామహులు, పితృతుల్యాలు, మాతామహులు, సోదర సమానులు, బావమరదులు, పుత్రసమానులు, మిత్రులు, కనిపిస్తున్నారు. రాజ్యం కోసం యుద్ధం చేసి వీరిని వధించడం నావల్ల కాదు. ఈ నెత్తుటి కూడు నాకు వద్దు. నేనీ ఘోరం చెయ్యలేను. ఈ యుద్ధాన్ని ప్రారంభించకుండా నేను కురుక్షేత్రం నుండి వెళ్ళిపోదల్చుకున్నాను. దయచేసి రథాన్ని మళ్ళించు" అన్నాడు.

బంధుజన ప్రియంకరుడైన అర్జునుడి దయాగుణాన్ని అప్పుడు పసికట్టాడు కృష్ణుడు.

ఎన్నో విధాలుగా కర్తవ్యం గురించి వివరిస్తూ, గీతోపదేశం చేసి, చివరకు అర్జునుడికి కృష్ణుడు తన విశ్వరూపాన్ని చూపించాడు.

భూమ్యాకాశాలకు వెలిగిస్తూన్న మహత్తర తేజఃపుంజాలను వెదజల్లుతున్న నీలమేఘరూపుడైన ఓ దివ్య పురుషుడు రకరకాల ఆయుధాలతో కౌరవసైన్యాలను నురు మాడుతున్న అద్భుత దృశ్యం అప్పుడు అర్జునుడికి మాత్రం గోచరించింది. అతడు కనురెప్ప వెయ్యకుండా కృష్ణుడి ప్రతి



రూపమైన ఆ మహారూపాన్నే చూడసాగాడు.

కృష్ణుడు "పార్థా చూస్తున్నావు కదా? చంపేవాడివి నువ్వు కాదు. నువ్వు కేవలం నిమిత్త మాత్రుడివి! భ్రమ తొలగించుకుని శంఖం పూరించు" అని విశ్వరూపాన్ని ఉపసంహరిచాడు.

అర్జునుడు భ్రాంతినుండి తేరుకుంటున్న ఆ సమయంలో కృష్ణుడు మరింత ప్రభోధాన్ని అతడిపై ప్రయోగిస్తూ గతంలో కౌరవులు చేసిన దుర్మార్గాలను, అన్నదమ్ములతో, ద్రౌపదితో కలిసి అర్జునుడు పడిన అవమానాలను జ్ఞాపకం చేశాడు.

క్రమంగా అర్జునుడి మనస్సులోని కరుణ తొలగిపోయింది. భయంకరమైన పగ, ప్రతీకార సంకల్పం చోటు చేసుకున్నాయి.....

వెంటనే తీవ్రదృష్టులను కౌరవసైనికుల మీద పరగిస్తూ "బావా! రథాన్ని ముందుకు పోనివ్వు! ఈ ధర్మ యుద్ధంలో విజయం సాధించి అఖండ భారత సామ్రాజ్యానికి మా అన్నయైన ధర్మరాజును సార్వభౌముణ్ణి చేస్తాను" అన్నాడు.

కృష్ణుడు సంతోషంతో ముందుకు తిరిగి అశ్వాల పగ్గాలను సడలిస్తూ అదలించాడు.

రథం మెరుపు వేగంతో భీష్మణ్ణి సమీపించగానే అర్జునుడు అగ్ని దేవుని చేత ప్రసాదించబడిన 'దేవదత్తం' అనబడే దివ్య శంఖాన్ని భూనభోంత రాళాలు దద్దరిల్లేట్లు ఊదాడు.

కృష్ణుడు కూడా పరమోత్సాహంతో నిలబడి తన పాంచజన్య శంఖాన్ని దిక్కులు పిక్కటిల్లేట్లు పూరించాడు.

ఆ మహాపురుషుల శంఖధ్వనులను అనుసరిస్తూ వరుసగా, ధర్మరాజు భీముడు, నకుల సహదేవులు, ధృష్టద్యుమ్నుడు, ఘటోత్కచుడు, ఉపపాండవులు, అభిమన్యుడు, సాత్యకి తమ తమ శంఖాలను గట్టిగా వూదారు!

యుద్ధ ప్రారంభాన్ని సూచిస్తూ పాండవ యోధులు అలా శంఖారావాలు చెయ్యగానే భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, దుర్యోధనుడు మొదలైన కౌరవ వీరులు కూడా తమ తమ శంఖాలను పూరించారు.

ఆ ఇరు పక్షాల వీరువరులు శంఖాల మ్రోతలతో విశ్వాంతరాళం మారుమ్రోగింది!

—వెనువెంటనే సింహనాదాలు చేసుకుంటూ, చేతుల్లోని ఆయుధాలను చిత్ర విచిత్రంగా త్రిప్పుతూ ఉభయ సైన్యాలు - సముద్రం సముద్రంతో

తలపడినట్లూ, ఆకాశం ఆకాశంతో పోరాటానికి ఉపక్రమించినట్లు భూమి, భూమితో ఢీకొంటున్నట్లూ లోకభీకరంగా తలపడ్డాయి!

నభూత నభవిష్యతి అన్న విధంగా జరిగే ఆ మహాయుద్ధాన్ని తిలకించడానికి పైలోకాలనుంచి దివ్య పురుషులంతా తమ తమ రాణులతో కలిసి పుష్పక విమానలెక్కి క్రిందికే చూడనారంభించారు.

గంధర్వరాజైన సుచిత్రకేతుడు తండ్రితో కలిసి పైన ఓ విమానంనుండి క్రింద తన అల్లుడైన ఘటోత్కచుడి యుద్ధ క్రీడా విశేషాల్ని ఉత్కంఠంతో వీక్షించసాగాడు.

అలా ప్రారంభమైన యుద్ధం కొద్ది సేపటిలోనే తీవ్రరూపం ధరించింది.

ఎక్కడెక్కడి నుంచో రివ్వురివ్వున బాణాలు వచ్చి శరీరాలను జల్లెడ గంతలు చేస్తున్నాయి.

ఖడ్గాలు విసురుగా ముందుగా వచ్చి పొట్టలు చీలుస్తూ, తలలను ఖండిస్తూ తళ తళ మెరుస్తున్నాయి!

గదలు తలలను బ్రద్దలు కొడుతున్నాయి...చేతులు తెగి పడుతున్నాయి. కాళ్ళు విరిగిపోతున్నాయి.....

ఇరువేపులా నేలకొరుగుతున్న సైనికుల సముదాయాల శరీరాలనుండి ధారలు ధారలుగా దూకుతున్న రక్తం కాలువలై పారుతోంది. ఆ రక్తపుటేరులలో తలలు, మొండాలు, కాళ్ళు, చేతులు, కళేబరాలు, ఆయుధాలు కలిసిపోతున్నాయి.

అర్జునుడు ప్రయోగించే బాణాల ధాటికి కౌరవ సైనికులు వెనక్కి తగ్గుతూ, వేల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతూండటం చూసి భీష్ముడు ఎదురు నిలిచాడు. తాతా మనుమళ్ల యుద్ధం కొంత సేపు ప్రళయభీకరంగా కొనసాగింది. అంతలో సంశప్తక దళాలు మరోవేపు నుండి పాండవ





భీష్ముడు మరింత శౌర్యంతో విజృంభించాడు. అప్పుడు సాత్యకి, ధృష్టద్యుమ్నుడు వచ్చి భీష్మణ్ణి తలపడ్డారు. కొంత సేపటికే ధృష్టద్యుమ్నుడు భీష్ముడి బాణాలు తగిలి, మూర్ఛలో మునిగిపోగా, సారథి రథాన్ని ప్రక్కకు మరలించుకుని ఇంకోవేపు వెళ్ళిపోయాడు.

అడ్డూ, అదుపూ లేకుండా పాండవ వీరులను పారవద్రోలుతూ, వాళ్ల సైన్యాలను నేలకూలుస్తూన్న భీష్మాచార్యుణ్ణి చూసి కౌరవ సైనికులు ఉత్సాహంతో కేకలు వెయ్యసాగారు. క్రమంగా పాండవ సైనికులు వెనుకకు మరలుతూండటంతో, వాళ్లను బాణాలతో నొప్పిస్తూ హతమారుస్తూ భీష్ముడు ముందుకు రాసాగాడు.

భీష్ముడి రథం మూడు వేపులా లక్షలాది కౌరవ సైనికులు విజయట్టహాసాలు చేస్తూ ఆయుధాలను పాండవ సైనికుల మీద గుప్పించసాగారు.

సైన్యాల మధ్య కలయతిరుగుతూ ఒక్కోగుంపు దగ్గరే తన కర్తవ్యాన్ని పూర్తి చేస్తున్న ఘటోత్కచుడు ఉత్తర దిక్కుభాగంలోని సైనికులు భీష్ముడి బారిన పడి మరణిస్తూండటం గమనించాడు.

వెంటనే అతడు రివ్వున అభిమన్యుడి దగ్గరికి సైనికుల తలల మీదుగా పయనించాడు. అప్పుడు ఉపపాండవులు కూడా అభిమన్యునితో కలిసి శ్రుతవులతో పోరాడుతున్నారు.

ఘటోత్కచుడు అభిమన్యుడితో "తమ్ముడూ! మన ముత్తాతగారి ఆర్భాటం అంతకంతకు అధికం అవుతున్నది. ఇప్పుడిక్కడ మన తండ్రులు

సైన్యాలను చుట్టుముట్టి మట్టుబెట్టటం ప్రారంభించేసరికి, అర్జునుడు తన రథాన్ని అటువేపు పోనిమ్మని కృష్ణునితో చెప్పాడు.

కృష్ణుడా విధంగా చేసేసరికి భీష్ముడి ప్రతాపానికి అడ్డులేకపోయింది.

పాండవ సైనికులు భీష్ముని బాణాల పరంపరకు తాళలేక హాహాకారాలు చెయ్యసాగారు. మరికొందరు అటూ ఇటూ పారిపోసాగారు.

ఆ సంరంభం చూసి ధర్మరాజు భీమ, నకుల సహదేవులతో కలిసి వచ్చి భీష్మణ్ణి మార్కొన్నాడు. కాని, పట్టపగటింటి భాను బింబంలా ప్రకాశిస్తూన్న భీష్ముడి ముందు వాళ్లంతా ఎంతో సేపు నిలువలేక పోయారు.

పాండు కుమారులను ప్రక్కకు పారద్రోలిన

గాని, ధృష్టద్యుమ్న, సాత్యకి మామగార్లుగాని లేకపోవటంతో మన సైన్యాలను భీష్ముడు చెల్లాచెదరు చేస్తూ నేలకూలుస్తున్నాడు. నేను వెళ్లి భీష్మణ్ణి నిలువరిస్తాను. భీష్ముని చుట్టూ లెక్కలేనన్ని కౌరవ బలగాలు కూడా వున్నాయి. అక్కడ మనకు తీవ్రమైన ప్రతిఘటన ఏర్పడవచ్చు. నువ్వు, తమ్ముళ్లూ కలిసి అక్కడికి రండి. లేకపోతే మన సైనికులు లక్షల సంఖ్యలో మరణించవచ్చు" అని చెప్పి శాంబరీ విద్యాపాటవంతో గాలిలో ప్రయాణిస్తూ ముందుకు సాగిపోయాడు.

వెంటనే అభిమన్యుడు ఆ చుట్టుప్రక్కల వున్న కౌరవసైన్యాలను సమ్మోహనాస్త్రంతో మూర్ఛిల్లజేసి, ఉప పాండవులతో "అన్నలారా! పెద్దన్నయ్య దగ్గరికి వెళ్లటానికి దారి ఏర్పరిచాను. త్వరగా పదండి" అన్నాడు.

అభిమన్యుడి సారథి, ఉపపాండవుల సారథి తమ యజమానుల ఆజ్ఞ ప్రకారం రథాలను భీష్ముడు యుద్ధం చేస్తున్న దిశగా పరుగెత్తించసాగారు.

భీష్ముడి బాణాలకు తాళలేని పాండవ సైనికులు హాహాకారాలు చేస్తూ అటు ఇటూ పారిపోవటం అప్పుడే అక్కడికి చేరుకున్న ఘటోత్కచుడు గమనించాడు. వెంటనే వాళ్ల చుట్టూ పరిభ్రమిస్తూ "ఓహూ, పాండవ వీరసైనికులారా! శత్రువుకు వెన్నిచ్చి పారిపోవటం యోధుల లక్షణం కాదు. శరీరాల్లో కొనవూపిరి ఉన్నంతవరకూ యుద్ధరంగం నుంచి వైదొలగకూడదు. మీకందరికీ రక్షకుడిగా నేనున్నాను. భీష్మదేవుణ్ణి ఎదుర్కొని నిలువరిస్తాను. మీరంతా ధైర్యంతో శత్రువులను ఎదురొడ్డి పోరాటం కొనసాగించండి" అని ఎలుగెత్తి హెచ్చరించాడు.

వెంటనే పాండవ సైనికులు పారిపోవటం

చాలించి "జయహెూ వీర ఘటోత్కచ నాయకా!" అని దిక్కులు పిక్కటిల్లేటట్లు ఉత్సాహ భరితంగా కేకలు వేస్తూ నూతనోత్సాహంతో ఆయుధాలు సవరించుకున్ని యుద్ధానికి సిద్ధమయ్యారు. ఘటోత్కచుడు సింహనాదం చేస్తూ, ధనుష్టంకారంతో విరోధుల గుండెలను అదరగొడుతూ, వేల కొలదీ బాణాలను భీష్ముడి రథం చుట్టూ వున్న కౌరవసైనికుల మీదకు ప్రయోగించాడు. వాళ్లు ఆ బాణాలు తగిలి హాహాకారాలు చెయ్యసాగారు. అదే సమయంలో - పాండవ సైనికులు సుడిగాలుల్లా కౌరవసైనికులను చుట్టుముట్టి నేల కూల్చటం ప్రారంభించారు!

భీమసేన కుమారుడు ఆ విధంగా తమ సైన్యాలకు రక్షణ నిచ్చి, వీరప్రబోధంతో వాళ్లను ఉత్సాహపరిచి తన సైనికుల మీద విరుచుకు పడగానే భీష్ముడు తన రథాన్ని ఘటోత్కచుడి దగ్గరికి తోలించాడు.

సమరంలో తనను ముఖాముఖి తలపడటానికి కురుపితామహుడు రాగానే ఘటోత్కచుడు చిరునవ్వుతో నమస్కరించి "ముత్తాతగారూ! ఇంతవరకూ పాండుపుత్రుల మీద చూపించిన ప్రతాపాన్ని ఇప్పుడు వారి పుత్రుడి మీద చూపించటానికి వచ్చారా? మీతో యుద్ధం నాకూ ఆనంద దాయకమే!" అన్నాడు.

భీష్ముడు కూడా మందహాసం చేస్తూ "మునిమనవడా! ఇంతకుమునుపు నువ్వు చేసిన ఘనకార్యాలను కొన్నింటిని విని వున్నాను. మంత్రతంత్ర మాయాయుద్ధ విశారదుడూ, దివ్యాస్త్రశస్త్ర సంపన్నుడూ, పరమేశ్వరవరప్రసాదితుడూ అయిన వీర ఘటోత్కచుడితో పోరే అవకాశం కలిగినందుకు నేను కూడా సంతోషిస్తున్నాను. వాడి, వేడి గల ఈ భీష్మయోధుడి బాణాలు రుచి చూడటానికి సిద్ధంగా ఉండు" అన్నాడు.

వెంటనే ఘటోత్కచుడు వింట సంధించిన బాణాన్ని కన్నుమూసి తెరిచేలోగా భీష్ముడి వక్షస్థలం నాటుకునేట్టు ప్రయోగించాడు. —(ఇంకావుంది)

గురు శిష్యులు

ఒకానొకప్పుడు కొత్తపేట గ్రామంలో రహీమ్ అనే దర్జీవాడుండేవాడు. ఆయన ఎక్కడెక్కడికో వెళ్ళి బట్టలు కుట్టడంలోని మెలకువలన్నీ నేర్చుకుని వచ్చాడని అంతా చెప్పుకునే వారు. తనకిచ్చిన పనిని శ్రద్ధగా చేయడం తప్ప రహీమ్ తన గురించి ఎక్కువగా ఎవరికీ చెప్పుకునేవాడు కాదు.

నజీర్ అనే వాడికి దర్జీపని ఇష్టం. వాడు కొంతకాలం పాటు రహీమ్ వద్ద శుశ్రూష చేసి కొంత విద్య నేర్చుకున్నాక, “అయ్యా! తమరింకా పాతపద్ధతులనే అనుసరిస్తున్నారు. కొత్త పద్ధతుల్లో కుడితే మన విద్యకింకా మంచి గిరాకీ ఉంటుందికదా!” అన్నాడు.

బేతాళ కథలు



“బాబూ! మనముంటున్నది గ్రామ ప్రాంతంలో. ఇక్కడ ప్రజలు వళ్ళు కప్పుకునేందుకు మాత్రమే బట్టలు ధరిస్తారు. తొడుక్కునేందుకు వీలుగానూ, తొడుక్కున్నాక సుఖంగానూ ఉండేలా వాళ్ళకు బట్టలు కుడితే చాలు. కొత్త రకాలుగా బట్టలు వీళ్ళు భరించలేరు. నీకు పట్నం వెళ్ళే ఉద్దేశ్యముంటేనే కొత్త పద్ధతులు నేర్చుకోవాలి” అంటూ రహీం నజీర్‌కి హితబోధ చేశాడు.

గురువుగారికి కొత్త పద్ధతులు రావనీ అందుకే ఆయనలాగంటున్నాడనీ నజీర్ భావించాడు. వాడు పట్నానికి వెళ్ళి కొన్ని కొత్త పద్ధతులు నేర్చుకున్నాడు సలీమ్ అనే గురువు వద్ద. అయితే, పట్నంలో చాలామంది కొత్త పద్ధతుల్లో బట్టలు కుడుతున్నారు. అక్కడ పోటీ ఎక్కువ. అందుకని నజీర్ పట్నం విడిచి తిరిగి కొత్తపేట గ్రామం వచ్చాడు.

కొత్తపేటలో ఎక్కువమంది రహీమ్ వద్దనే బట్టలు కుట్టించుకుంటున్నారు. మరో దర్జీవాడు లేక రహీం పని ఎద్దడిగా ఉండేది. నజీర్ తనతో కలిస్తే బాగుండునని ఆయన అనుకున్నాడు కానీ వాడు విడిగా బట్టలు కుట్టే దుకాణం తెరిచాడు. కలిసైతేనేం, విడిగా అయితేనేం ఊళ్లో రెండో దర్జీ ఉండడం మంచిదేనని రహీం సరిపెట్టుకున్నాడు.

ఊరంతా రహీంను పొగుడుతూంటారు. నజీర్ తనింకా పేరు తెచ్చుకోవాలన్న పట్టుదలతో ఊళ్ళో అందరికీ కొత్త పద్ధతిలో బట్టలు కుట్టసాగాడు. అందుకు ధర ఎక్కువైనా ప్రజలనుంచి రహీంలాగే తక్కువ ధరనే తీసుకునేవాడు. అందువల్ల క్రమంగా ఒకరొక్కరే రహీంనుంచి నజీర్ వద్దకు మారిపోసాగారు.

రహీం నజీర్ని కలుసుకొని, “నీవు చాలా తక్కువ ధరకు బట్టలు కుడుతున్నావు. అందువల్ల నీకు నష్టం వస్తుంది. నాకు బేరాలు పోతున్నాయి. ఇలా ఎంత కాలమో సాగదు. ఈ పద్ధతి మానుకో” అని చెప్పాడు.

నజీర్ నవ్వి, “గురువర్యా! నేను గురువుని మించిన శిష్యుడినైతే అందుకు మీరు సంతోషించాలి తప్ప అసూయపడకూడదు” అన్నాడు.

రహీం దెబ్బతిని, “నాకు అసూయ లేదు. నీ మంచికే చెబుతున్నాను. నువ్వు కొత్త పద్ధతిలో నష్టపోకుండా బట్టలు కుట్టగలిగితే నేను నా

దుకాణం మూసివేసి నీవద్ద పనికి చేరతాను. నీవు నెలనెలా నాకు కొంత జీతమిస్తూండు'' అన్నాడు.

నజీర్ నవ్వి, ''వ్యాపారంలో అన్నదమ్ములూ, తండ్రీకొడుకులూ పరస్పరం నమ్మకోకూడదు. అలాంటప్పుడు గురుశిష్యులమైన మనవద్ద నమ్మకమెలా కుదురుతుంది? మీరు నావద్ద పనిలోకి చేరితే నేను మిమ్మల్ని నమ్మినా ప్రజలు నమ్ముతారా? రహీం తనకు రాని విద్యలు నేర్చుకునేందుకు శిష్యుడివద్ద చేరాడనీ ఆ తర్వాత మళ్ళీ వేరే దుకాణం తెరుస్తాడనీ అంతా అనుకుంటారు" అన్నాడు.

రహీం ముఖం చిన్నబోయింది, ''నేను నీకు కుట్టుపని నేర్పినపుడు నీ గురించి ఇలా అనుకోలేదు" అన్నాడాయన.

''అయ్యో, గురువర్యా! నన్ను మీరపార్థం చేసుకుంటున్నారు. మిమ్మల్ని గురించి ప్రజలేమనుకుంటారో నేను మీకు చెప్పాను తప్ప నేనలా అనుకుంటానని అనలేదే!'' అన్నాడు నజీర్ నక్క వినయాలు నటిస్తూ.

''పోనీ నువ్వేమనుకుంటున్నావో చెప్పు. నన్ను పనిలోకి తీసుకునేదీ లేనిదీ చెప్పు'' అన్నాడు రహీం.

''నాకు మీరంటే ఎప్పుడూ గౌరవభావమే! అయితే, ప్రజలు మిమ్మల్ని అపార్థం చేసుకుంటే భరించలేను. మీరు నావద్ద పనిలో చేరాక - ఎప్పటికీ నాపని మాననని, జీవితంలో మరో దుకాణం తెరవననీ పత్రం రాసిస్తారా?'' అనడిగాడు నజీర్.

రహీం మారు మాట్లాడకుండా గిరుక్కున



వెనక్కు తిరిగాడు. ఆ తర్వాత ఆయన తను కూడా కొత్త కొత్త పద్ధతుల్లో బట్టలు కుట్టసాగాడు. అవి నజీర్ కుట్టిన వాటికంటే ఆకర్షణీయంగా ఉండడంవల్ల క్రమంగా అంతా ఆయన వద్దకే వెళ్ళసాగారు.

ఇప్పుడు రహీంకి మళ్ళీ చేతినిండా పని. ఎంత ఆలస్యమైనా ఫరవాలేదని అంతా ఆయనకే బట్టలనిస్తున్నారు.

నజీర్ దుకాణం మూతపడే స్థితికి వచ్చింది. వాడు దిగులుగా రహీంని కలుసుకుని, "పట్నంలో సలీం దగ్గర నేను నేర్చుకున్న దానికంటే గొప్పగా కుట్టడం మీకెలా సాధ్యపడిందో నాకర్థం కావడంలేదు" అన్నాడు.

"మూర్ఖుడా! సలీం నాకంటే ఎక్కువ నేర్పగలడని ఎలాగనుకున్నావు? వాడు నా శిష్యుడు" అన్నాడు రహీం.

"సలీం మీ శిష్యుడా? అయితే మీరు పట్నంలో ఎందుకు స్థిరపడలేదు?" అన్నాడు నజీర్ ఆశ్చర్యంగా.

"నేను నీకు ముందే చెప్పాను. పట్నం కంటే గ్రామాలే నాకిష్టమని. నేను నీ వయసులో ఉండగా ఎన్నెన్నో పట్నాలు తిరిగి ఎనెన్నో కొత్త పద్ధతులు నేర్చుకున్నాను. ఆ తర్వాత చాలా పట్నాల్లో నా శిష్యులు దర్జీలుగా స్థిరపడి సుఖంగా ఉంటున్నారు. అయితే, వాళ్ళెవరూ నీవంటి శిష్యులు కారు. నేనంటే వారికి కృతజ్ఞత ఉంది. నా కెన్నడూ నష్టం కలిగించే పని వారు చేయలేదు" అన్నాడు రహీం.

నజీర్‌కు ఉక్రోషం వచ్చింది, "గురువర్యా! తప్పు నాది మాత్రమే కాదు. మీకు వచ్చిన విద్యలన్నీ మీరు నాకు నేర్పలేదు. లేకుంటే నేను పట్నం వెళ్ళాల్సి ఉండేదేకాదు. తర్వాత మీరు నావద్ద పనిలో చేరతానన్నారు తప్ప తమకింకా కొత్త విద్యలు వచ్చునని చెప్పలేదు. నావల్ల మీ వ్యాపారం దెబ్బతిని ఉండవచ్చును కానీ చివరకు మీరే నా వ్యాపారాన్ని దెబ్బతీశారు. ఇన్ని చేసి తప్పంతా నాదేనన్నట్లు మాట్లాడడం న్యాయంగా ఉందా?" అన్నాడు.

కరాళుడింతవరకే చెప్పి, "ఓ సవిత్ర్యక మహారాజా! నజీర్ ఆరోపణలో సబబున్నదని నాకు తోస్తోంది. లేని పక్షంలో రహీం అలా ఎందుకు ప్రవర్తించాడో నన్న సందేహం ఉండి

పోతుంది. నీ విచక్షణతో నన్నీ సందిగ్ధంనుండి బయటపడవేయాలి. తెలిసి కూడా మాట్లాడక పోయావో ఈ క్షణం నుంచీ నీవు నాకు బానిసవు" అన్నాడు.

దీనికి సవిత్ర్యకుడిలా బదులిచ్చాడు:

"విద్య వేరు. వ్యాపారం వేరు. విద్యారంగంలో గురువు శిష్యుడికి తనకు తెలిసినదంతా చెబుతాడు. వ్యాపారరంగంలో గురువు శిష్యుడికి దారి చూపిస్తాడు. ఆ తర్వాత ఎవరికి వారు స్వంత తెలివితో రాణించాలి.

"రహీం తన శిష్యులెవ్వరికీ అన్ని విద్యలూ నేర్పలేదు. అది వ్యాపార ధర్మం."

"అయితే ఆరంభంలోనే తనకు అన్ని విద్యలూ వచ్చుననీ గ్రామాల్లో కొత్త పద్ధతులు అవసరం లేదనీ రహీం శిష్యుడికి స్పష్టం చేశాడు. అయినా నజీర్ లెక్కచేయక తను నష్టపోతూ గురువు వ్యాపారాన్ని దెబ్బ తీశాడు. అప్పటికీ గురువు శిష్యుడివద్ద పనిలో చేరాలనుకున్నాడు తప్ప దెబ్బ తీయాలనుకోలేదు. అందుక్కారణం నజీర్ నష్టం లేకుండా కొత్తపద్ధతిలో బట్టలు కుడుతున్నాడని ఆయన నమ్మడమే!

"గురువు చిత్తశుద్ధిని గౌరవించడానికి బదులు నజీర్ ఆయన్ను సవాలు చేశాడు. సమర్థుడు సవాలును తేలికగా తీసుకోడు. రహీం శిష్యుడి సవాలుకు తన సార్థ్యంతో బదులిచ్చాడు. సవాలు చేసినవాడు ఫలితాన్ననుభవించక తప్పదు. అందులో గురువు తప్పేమీ లేదు. నజీర్ ఆయనపై ఆరోపణలు చేయడం వాడి తప్పు, వ్యాపారంలో వాడు నష్టపోతే అది వాడికి వాడే చేసుకున్న స్వయంకృతాపరాధమే అవుతుంది. గురువును సవాలు చేసినవాడు సమర్థుడు కాలేడు."

అది సరియైన సమాధానం కావడంతో అంత వరకూ సవిత్ర్యకుడి కెదురుగా ఉన్న కన్యపై కరాళుడి ప్రభావం పూర్తిగా నశించి ఆ యువతి ఒకనల్ల చిరుతగా మారి అడవిలోనికి పరుగు తీసింది.

—షేక్ హున్నార్





దేవుడివల్ల కాని పని

భీమదాసు గొప్ప భక్తుడు. ఎక్కడ దేవాలయమున్నా వెళ్ళి ఏ దేవుడికైనా మ్రొక్కి వస్తాడు. సీతాపురంలో మల్లేశ్వరుడికి కొత్తగా ఆలయం కట్టారనీ అక్కడ ఏ మ్రొక్కు మ్రొక్కుకున్నా వెంటనే అయిపోతోందనీ చాలామంది చెప్పుకున్నారు.

భీమదాసు పొలంలో రెండు సంవత్సరాలుగా పంటలు లేవు. ఇంకోసారి పండకపోతే ఆయన సంసారం వీధిన పడుతుంది. ఏ పుట్టలో ఏ పాముందోనని ఆయన సీతాపురం వచ్చి మల్లేశ్వరుడి దర్శనం చేసుకుంటానని మ్రొక్కుకున్నాడు.

ఆ ఏడాది భీమదాసు పొలంలో విపరీతంగా పంట పండింది.

అంతా సీతాపురం మల్లేశ్వరుడి మహిమగా భావించి ఆయన వెంటనే ఆ స్వామి దర్శనార్థం బయల్దేరాడు.

భీమదాసు సీతాపురం చేరుకునేసరికి అక్కడ ఇంతా అంతా అనరాని రద్దీగా ఉంది. ఈ దైవదర్శనార్థం లక్షలాది భక్తులు వచ్చి ఉన్నారు. కనీసం రెండు మూడు రోజులైనా అక్కడుంటే కానీ దర్శనమయ్యేలా లేదు. అందుకని ఏ ఇంట్లోనైనా అద్దెకుందామంటే అందరూ రోజుకు వంద వరహాలకు పైగా అడుగుతున్నారు. అంత డబ్బు భీమదాసువద్ద లేదు.

ఏం చేయాలా అని ఆలోచిస్తూండగా ఆయనకు అనుకోకుండా చిన్ననాటి స్నేహితుడు రమాపతి కనిపించాడు. రమాపతే భీమదాసును చూసి గుర్తుపట్టి, "ఏరా, గుర్తున్నానా?" అంటూ పలకరించి విషయం తెలుసుకుని, "ఈ ఊళ్ళో నాకో ఇల్లుంది. అందులో పదకొండు గదులున్నాయి. రోజుకి వెయ్యి వరహాలిచ్చే షరతుమీద ఒకడికా ఇల్లప్పజెప్పాను. వాడు గదికి నూటయాభై నుంచి రెండువందల వరహాల దాకా వసూలు చేస్తూ లాభం పొందుతున్నాడు. నాకైనా, నా స్నేహితులకైనా ఒక గది అట్టే పెట్టి ఉంచుతాడు. దానికి పది వరహాలు మాత్రమే అద్దె. రాక రాక వచ్చిన చిన్ననాటి మిత్రుడివి. నీ అద్దె కావాలంటే

బాబి

నేనిచ్చుకుంటాను. కానీ, అలా చేస్తే నీకు పుణ్యాం దక్కదు'' అన్నాడు.

పదివరహాలూ మిత్రుడికిచ్చుకుని, "నీ ఇల్లద్దెకొస్తే మరి నువ్వెక్కడుంటున్నావు?'' అనడిగాడు భీమదాసు.

''నేను చెట్టుకింద ఉంటున్నాను. దానికీ ఓ వరహా అద్దె ఇవ్వాలి. అదీ ఒకందుకు మంచిదే! నాకు కష్టం అలవాటవుతోంది. ఒకోసారి రోజుకు పెద్దెనిమిది గంటలు ఆలయం ముందు అడుక్కుంటున్నాను. దేవాలయం ముందు ఎంతసేపు అడుక్కుంటే అంత డబ్బు కదా!'' అన్నాడు.

''ఇంత బ్రతుకూ బ్రతికి చివరకు అడుక్కుంటున్నావా?" అన్నాడు భీమదాసు ఆశ్చర్యంగా. స్నేహితుని వంక చూస్తూ.

''దేవుడిముందు అంతా బిచ్చగాళ్ళే! కాబట్టి అడుక్కోవడంలో తప్పు లేదు. ఈ ఊరి మల్లేశ్వరుడి ధర్మమా అని నా జీవితకాలం వ్యాపారంలో సంపాదించిన డబ్బు ఇక్కడ ఒక్క ఏడాదిలో సంపాదించాను'' అన్నాడు రమాపతి.

భీమదాసాయన్ను వివరాలాట్టే అడక్క తనకు ఇంతకంటే సులభంగా దైవదర్శనమయ్యే ఉపాయం చెప్పమన్నాడు.

''అందుకు మూడు పద్ధతులున్నాయి. ఒకటి వరసలో నిలబడడం. ఆ విధంగా నీ వంతు వచ్చేసరికి ఒకోసారి పదిరోజులు పట్టవచ్చు. అయినా ఫరవాలేదు. వరసలో ఉన్నంత కాలం నీ ఆకలి తీర్చడానికీ, కాలకృత్యాలు తీర్చుకుందుకూ రోజుకు యాభై వరహాల దాకా ఖర్చు చేయాలి. లేదూ, ఒక్కసారి వెయ్యి వరహాలిస్తే ఆరుగంటల్లోనూ,



అయిదువేల వరహాలిస్తే రెండుగంటల్లోనూ, పదివేల వరహాలిస్తే పదినిముషాల్లోనూ దైవదర్శనం చేయించగల దళారున్నారు. ఇవి నీవల్ల కాదంటే ఆఖరి ఉపాయంగా కన్నయ్య వద్దకు వెళ్ళాలి. వాడికి పదివరహాలిస్తే దేవుడు కలలో కనిపించేలా చేస్తాడు. సీతాపురంలో ఉండగ దేవుడు కలలో కనిపించినా ప్రత్యక్ష దర్శనంతో సమానంట'' అన్నాడు రమాపతి.

భీమదాసీ వివరాలు విని హడిలిపోయాడు. ఇంతకాలం దైవభక్తి పేరుచెప్పి చిన్న చిన్న ప్రయోజనాలు పొందుతూ ఎక్కడెక్కడి దేవుళ్ళకూ మొక్కుబడులు తీర్చుతూ వచ్చాడు. ఒక్క దేవుడి కోసం ఇంత డబ్బు ఖర్చు పెట్టగల సమర్థత ఆయనకు లేదు.

చివరకాయన కన్నయ్య వద్దకే వెళ్ళాడు.

కన్నయ్య వద్ద కూడా చాలా పెద్ద వరస ఉంది. నాలుగు గంటలావరసలో నిలబడ్డాక కన్నయ్య ఒక్కసారి పదిమందిని లోపలకు రానివ్వగా వారిలో భీమదాసుకూ అవకాశం వచ్చింది.

కన్నయ్య ఒక్కొక్కరి వద్ద పదేసి వరహాలు తీసుకుని అందర్నీ కళ్ళు మూసుకోమన్నాడు. తర్వాత ఏదో మంత్రం గట్టిగా చదివాడు. అది వింటూంటే భీమదాసులో ఏదో పరవశం కలిగింది.

భక్తిపారవశ్యంతో ఊగిపోతున్న ఆయన కళ్ళ ముందు మల్లేశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు.

"నరుడా! ఏమి నీ కోరిక!" అన్నాడు మల్లేశ్వరుడు.

''స్వామీ! ఇక నాకే కోరికలూ లేవు. ఆలయంలో నీ నిజరూపాన్ని చూడాలని కోరికగా ఉంది. అదొక్కటీ తీర్చు'' అన్నాడు భీమదాసు.

''నాయనా! అది నా చేతిలో లేదు. మనిషి చేతుల్లో ఉంది. కావాలంటే నీ పొలంలో ఇంకా బాగా పంటలు పండాలని కోరుకో. తీర్చగలను. దైవదర్శనం మాత్రం దేవునివల్ల కాని పని అని గుర్తుంచుకో'' అన్నాడు మల్లేశ్వరుడు.

ఈలోగా కన్నయ్య హెచ్చరించడంతో భీమదాసు అక్కణ్ణించి బయటపడక తప్పలేదు.



చిత్రవీర బహుమానం

వీర్రాజు, పేర్రాజు కవిత్వం నేర్చుకుందామని నిత్యానందుడనే మహాకవి వద్దకు వెళ్ళి శుశ్రూష చేయసాగారు. ఆరుమాసాలు గడిచేక నిత్యానందుడు పేర్రాజును శిష్యుడిగా స్వీకరించి వీర్రాజుతో, "నాయనా! నీ బుద్ధి కవిత్వానికి బదులు వ్యాపారానికి బాగా పనికివస్తుంది. నా మాట విని ఆ రంగంలో ప్రయత్నించు" అని పంపేశాడు.

ఇది వీర్రాజుకి అవమానంగా తోచింది. ఆ రోజే వాడు పేర్రాజుకంటే గొప్పవాడిననిపించుకోవాలని పంతం పట్టాడు. అయితే, ఎవరినడిగినా వాడు కవిత్వానికి పనికి రాడంటున్నారు.

అప్పుడు బేహారుడనే వ్యాపారి వాడిగురించి తెలుసుకుని, "కవులకంటే వ్యాపారే గొప్పవాడు. వ్యాపారి దగ్గర డబ్బు చేరుతుంది. అభివృద్ధి చెందుతుంది. వ్యాపారులు డబ్బిచ్చి పోషిస్తే కవికి విలువ ఉంటుంది. కాబట్టి నువ్వు నాకు చేదోడు వాదోడుగా ఉంటూ వ్యాపారంలో మెలకువలు నేర్చుకో" అని నచ్చజెప్పాడు

వీర్రాజు బేహారుడివద్ద చేరి వ్యాపారపు కిటుకులు త్వరత్వరగా తెలుసుకున్నాడు. వాడి చురుకుతనానికి బేహారుడెంతో సంతోషించి తన కూతుర్నిచ్చి పెళ్ళి చేశాడు. ఆ తర్వాత వీర్రాజు పట్టిందంతా బంగారమయింది. నాలుగైదు సంవత్సరాల్లో వాడు చిత్రనగరంలోని కోటీశ్వరులలో ఒకడయ్యాడు. అయినా వాడికో అసంతృప్తి ఉంది - తను కవి కాలేదని!

బేహారుడిది కనిపెట్టి, "కవులంటే ఎవరనుకున్నావు? ధనవంతులను మంచి చేసుకుని వాళ్ళ ప్రాపకంతో పొట్ట పోసుకునే అల్పజీవులు. నీవు ప్రతినెలా వెయ్యివరహాలు ఖర్చు చేయగలిగితే ఎందరో కవులు నిన్నే పొగుడుతూంటారు" అని చెప్పాడు.

అలాగే చేశాడు వీర్రాజు. ప్రతిరోజూ ఎవడో ఒకడు కవినంటూ వాడివద్దకు వచ్చి నాలుగు పద్యాలు చెప్పి, పదో, పాతికో పుచ్చుకుని వెడు

కమల



తూండేవారు.

కానీ, పేర్రాజెప్పుడూ వీర్రాజు దగ్గరకు రాలేదు. తన దగ్గరకు వెడితే డబ్బు దొరుకుతుందని తన మనుషుల ద్వారా వీర్రాజు పేర్రాజుకు చెప్పించాడు. పేర్రాజు అందుకు సమాధానంగా, "నేను అల్పులనుంచీ, అల్పమైనవీ అయిన బహుమానాలాశించను" అని చెప్పి వాళ్ళను పంపేశాడు.

క్రమంగా పేర్రాజుకు పేరు రాసాగింది. ఒక భాగ్యవంతుడు పేర్రాజుకు వెయ్యివరహాలిచ్చి సన్మానించాడు. మరొకడు రెండు వేలిచ్చి సన్మానించాడు. ఈ సన్మానాలతో పాటు కీర్తి కూడా నలుదిశలా వ్యాపించసాగింది.

దీంతో వీర్రాజుకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. అల్లుడి బాధను కనిపెట్టిన బేహారుడు, "నాయనా! నీవు సంవత్సరానికి పదికోట్ల రూపాయలు సంపాదించేటంతటి వాడి వయ్యావు. అయినా ఎందుకూ కొరగాని పేర్రాజుతో పోల్చుకుని బాధపడడం మానడం లేదు. నీ గొప్పతనం నీకు తెలియాలంటే ఒక ఉపాయం చెబుతాను. నీ పేరుమీదా, మన నగరం పేరుమీదా - చిత్రవీర బహుమానం నెలకొల్పు. అది ఏటా ఒక గొప్పకవికిప్పించు. బహుమానంగా లక్షవరహాల సొమ్ము, ఒక ప్రశంస పత్రం ఇవ్వు. లక్షవరహాలను అల్పమని ఎవరూ అనరు. అంత రొక్కాన్ని బహుమతిగా ఇచ్చే నిన్ను అల్పుడనీ ఎవరూ అనలేరు. కళాపోషకుడిగా నీకు గొప్ప పేరు వస్తుంది. అటుపైన నీ ఆస్తి నీకుండనే ఉంది" అన్నాడు.

ఈ ఉపాయం వీర్రాజుకెంతో నచ్చి వెంటనే అమలు జరిపాడు. ఆ ప్రకారం ఏటికొకరికి చొప్పున కవులనెన్నుకుని చిత్రవీర బహుమానన్నంద జేయసాగాడు వీర్రాజు. కొద్ది కాలానికే కళాపోషకుడిగా వీర్రాజుకు పేరొచ్చింది. చిత్రవీర బహుమానం అందుకోవాలని ఎందరో కవులు కావ్యసృష్టికి పూనుకో సాగారు. చిత్రవీర బహుమానం ఎవరికి లభిస్తుందా అని ప్రతి ఏటా ఎందరో ఎదురు చూస్తూండేవారు.

అలా ఆరేళ్ళు గడిచాయి. చిత్రవీర బహుమానం ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. కానీ, పేర్రాజుకా బహుమతినందుకునే అవకాశం ఒక్కసారి కూడా రాలేదు. ఆ విధంగా తన మిత్రుడి నవమానించానని

మనసులో సంతోషించాడు వీర్రాజు.

ఇలా ఉండగా వీర్రాజుకు చక్రవర్తినుండి పిలుపు వచ్చింది. ఆయన ఉత్తమ కవితా పోషకుల్ని సన్మానిస్తున్నాడు. అందులో ప్రథమస్థానం మగధ దేశస్థుడైన రవిపాలుడికి వచ్చింది. ద్వితీయస్థానం వీర్రాజుది.

రవిపాలుడు ఏటా ఉత్తమ కవికి పాతికవేల వరహాల బహుమతినిస్తున్నాడు. ఆయనకంటే తను తక్కువ ఎలాగయ్యాడో వీర్రాజుకు తెలియ లేదు. కానీ, చక్రవర్తి నిర్ణయాన్ని ప్రశ్నించే ధైర్యం లేక ఊరుకున్నాడు.

సన్మాన మంటపంలో చక్రవర్తి పక్కనే ఉన్న మహామాత్యుడు రవిపాలుడినీ, వీర్రాజునీ, మూడో స్థానంలో ఉన్న చతురుడిని ప్రశంసించి, "చతురుడు ఏటా అయిదువేల వరహాల బహుమతినే ఇచ్చినప్పటికీ ఉత్తమ కావ్యాలకు గుర్తింపు తేవడంవల్ల ఈ బహుమతికి అర్హుడయ్యాడు. తన బహుమతిని ఆయన పాతికవేల వరహాలకు పెంచి ఉంటే రవిపాలుడి స్థానం లభించి ఉండేదేమో! ఇక వీర్రాజు ఏటా లక్షవరహాలు బహుమతిగా ఇవ్వడం గొప్ప విశేషం. కానీ, పేర్రాజువంటి మహాకవిని ఆరేళ్ళలో ఒక్కసారి కూడా గుర్తించ లేకపోవడం ఆ బహుమతినిచ్చే న్యాయనిర్ణేతల లోపం. బహుమతి విలువ కవులకు లాభం తెస్తుంది. ఎన్నుకున్న కావ్యాలు బహుమతికి విలువనిస్తాయి. ఈ విషయం విస్మరించడంవల్ల చిత్రవీర బహుమానానికి రెండవ స్థానం వచ్చింది'' అని చెప్పాడు.

అప్పుడు వీర్రాడు కళ్ళు తెరుచుకున్నాయి. ఏ బహుమానమూ ఒకరిని అవమానించడానికి కాదనీ, నిష్పక్షపాతంగా ఉత్తమ నిర్ణయాలు చేసి నప్పుడే ఆ బహుమానం విలువ పెరుగుతుందనీ గ్రహించి మరుసటి సంవత్సరం పేర్రాజును ఉత్తమ కవిగా ఎన్నుకుని, చిత్రవీర బహుమతి నిచ్చి, వీర్రాజు తాను గొప్ప కళాపోషకుడనే పేరు తెచ్చుకున్నాడు.





తప్పెవరిది ?

చెన్నకేశవపురంలో తాగుబోతుల సంఖ్య ఎక్కువయింది. అందువల్ల ఊళ్ళో ఎక్కడో ఒకచోట తగవులయ్యేవి. పండుగరోజుల్లో అయితే ఇక చెప్పనే అక్కర్లేదు. అలాంటి సమయంలో ఆ ఊరికి గజపతి నాయకుడయ్యాడు.

గజపతి నాయకుడు కాగానే ఊరి పరిస్థితి ఆకళింపు చేసుకున్నాడు. తాగుడే అందుకు ముఖ్య కారణమని వాడికి అర్థమయింది. ఆ ఊళ్ళో ఒకే ఒక్క సారా కొట్టుంది. అది భద్రయ్యది.

భద్రయ్యను సారా కొట్టు మూసి వేయమని చెప్పాడు గజపతి. భద్రయ్య ఒప్పుకోకుండా, "సారా అమ్మడం నేరం కాదు. నేను కొట్టు మూయను" అన్నాడు.

అప్పుడు గజపతి ఊరి వారందర్నీ ఒక చోట సమావేశపర్చి, "మొన్న రత్తయ్య తాగిన మైకంలో భార్య తల పగులగొట్టాడు. నిన్న నాగయ్య తప్పతాగి పదేళ్ళ కొడుకుని నూతిలో పారేయబోయాడు. ఇలాంటి అనర్థాలకు మూలం తాగుడు, అయినా భద్రయ్య సారా దుకాణం మూయడం లేదు" అన్నాడు.

"ఎందుకు మూయడు? వారం రోజులు గడువిద్దాం. ఆలోగా వాడది మూయకపోతే బలవంతంగా మేమే దుకాణాన్ని మూయిస్తాం" అన్నారు గ్రామస్థులు ఆవేశంగా.

వారం రోజులు గడిచినా భద్రయ్య దుకాణం మూయలేదు. అప్పుడు గజపతి కొందరు యువకుల్ని పురమాయించి భద్రయ్య దుకాణంలో సారా కుండలన్నింటినీ పగులగొట్టించాడు.

భద్రయ్య కొత్త కుండలు కొని మర్నాడే మళ్ళీ సారా వ్యాపారం ప్రారంభించాడు. ఇది తెలిసి గజపతి మళ్ళీ కొందరు యువకుల్ని పురమాయించి వాడి పాకను కూలగొట్టించాడు.

దీనికీ భద్రయ్య చలించలేదు. వాడు మళ్ళీ కొత్త పాక వేసుకుని వ్యాపారం ప్రారంభించాడు.

పదే పదే భద్రయ్యపై అత్యాచారం చేయడానికి గజపతికే మనస్కరించలేదు. వాడు భద్రయ్యను

బూర్లె నరసింహాశాస్త్రి

కలుసుకుని, "ఇప్పటికే ఈ వ్యాపారంలో బోలెడు గడించావు. నీకింకా తృప్తిగా లేదా? నీకు డబ్బే ప్రధానమనుకుంటే నా ఆస్తిలో సగం నీకిస్తాను. అది తీసుకుని ఈ ఊరివాళ్ళను రక్షించు" అన్నాడు.

'నేను వ్యాపారినే కానీ భిక్షగాడిని కాను. నీ ఆస్తి నాకెందుకు? ఏదో వ్యాపారం నిత్యం చేస్తూండాలి తప్ప ఏ వ్యాపారీ సంపాదించినది తింటూ కూర్చోడు. ఒకొక్కళ్ళకి ఒకో వ్యాపారం బాగా చేతనవుతుంది. నాకిది చేతనయింది. ఈ వ్యాపారం సులభమనుకుంటున్నావేమో? ఇందులోని కష్టం తెలియాలంటే ఇక్కడికి కొస్త దూరంలో నీలగిరి అనే ఊరుంది. అక్కడ నేనిచ్చే రెండు కుండల సారాని డబ్బుకుగానీ, చివరికు ఊరికేగానీ ఇచ్చి ఎవరిచేతనైనా తాగించిరా! నేనీ వ్యాపారం మానేస్తాను" అన్నాడు భద్రయ్య.

ఈ సవాలు గజపతికి నచ్చింది. మర్నాడు వాడో మనిషి చేత సారా కావడి పట్టించి నీలగిరి వెళ్ళాడు. ఆ ఊరి మధ్యలో ఒక మర్రిచెట్టుంటే దాని క్రింద. సారా అమ్మకం ప్రారంభించాడు.

అది చాలా పెద్ద మర్రి చెట్టు కావడం వలన నీడ కోసం ఎందరో అక్కడికి వచ్చి కాసేపుండి వెడుతున్నారు. ప్రతి ఒక్కరూ గజపతి అమ్ముతున్న దేమిటో అడిగి తెలుసుకుని, "అయ్యో! ఇంకేమిటో అనుకున్నాం, సారాయా!" అంటూ పెదవి విరిచి వెళ్ళిపోతున్నారు.

సాయం సమయమయింది. గజపతి సారాలో ఒక్క చుక్క కూడా అమ్ముడుపోలేదు. అప్పుడే అక్కడకు వేరుశనక్కాయలమ్ముకునే వాడొక డొచ్చాడు. వాడిని చూసి గజపతి, "రోజంతా తిరిగి తిరిగి అలసిపోయుంటావు. అలసట

తీరడానికి కాస్త సారా పుచ్చుకో. డబ్బులొద్దులే ఊరికేనే!" అన్నాడు.

శనక్కాయల వాడు చిర్నవ్వు నవ్వి, "కొత్తగా వ్యాపారం మొదలెట్టే వాళ్ళందరూ ఇలాగే అంటారు. ఎలాగో కష్టపడి కొన్నాళ్ళు పెట్టుబడి పెట్టి అందరికీ అలవాటు చేస్తారు. ఆ తర్వాత వ్యాపారం మొదలెడతారు. ఇవన్నీ నాకు కొత్త కాదు. ఈ ఊళ్ళో మొట్టమొదటి సారా కొట్టు నాదే! కానీ ఇప్పుడీ ఊళ్ళో ఏ ఒక్కరూ చుక్క సారా కూడా తాగరు. అందుకే నేనా వ్యాపారం మాని ఈ వ్యాపారం మొదలెట్టాను. నా మాట విని నువ్వీ ఊళ్ళో డబ్బు సంపాదించాలంటే ఇంకో వ్యాపారం చూసుకో. లేదా ఈ వ్యాపారాన్ని ఇంకో ఊళ్ళో చేసుకో" అన్నాడు.

"బాబ్బాబూ! ఎలాగో అలా నా రెండు కుండల సారానీ ఇక్కడ అమ్మిపెడితే మా ఊళ్ళో సారా కొట్టు మూత పడుతుంది. నేను సారా వ్యాపారిని కాను—" అంటూ గజపతి కథంతా చెప్పాడు.

శనక్కాయల వాడు పెద్ద పెట్టున నవ్వి "దేనికైనా ఇంట గెలిచి రచ్చ గెలవాలి. మన బంగారం మంచిది కానప్పుడు కంసాలిని తప్పు పట్టి లాభంలేదు. మీ ఊళ్ళో ఎవరెవరు భద్రయ్య దుకాణంలో తాగడానికి వెడుతున్నారో ఆ ఇంటి వాళ్ళంతా వాళ్ళని ఆపాలి. తన దుకాణానికి ఎవరూ రాకపోతే భద్రయ్య కూడా నేను చేసిన పనే చేస్తాడు. కాబట్టి మీరు మీ గ్రామస్థులలో తాగుడు అలవాటు మాన్పించండి. అప్పుడు దుకాణం అదే మూతపడుతుంది. మా ఊరి నాయకుడు శ్రీముఖుడు తన బోధనలతో మా గ్రామస్థుల మనసు మార్చి ఈ అలవాటుకు దూరం చేశాడు. మీరు భద్రయ్య గురించి ఆలోచించడం మాని తాగుబోతుల గురించి ఆలోచించండి" అన్నాడు.

గజపతికి తన తప్పు తెలిసింది. వాడు చెన్న కేశవపురం వెళ్ళి శ్రీముఖుడి పద్ధతినే అనుసరించి అనుకున్న ఫలితం సాధించాడు.

బొమ్మరిల్లు ముచ్చట్లు

బాల వీరులు

కులం, మతం, వర్ణం, వృత్తి, ప్రవృత్తి పేర్లతో మనుషులు విడిపోయి తమలో తాము కలహించు కుంటూంటే రేపటి పౌరులైన నేటి బాలల మీద ఆ ప్రభావం పడకూడదన్న సత్సంకల్పంతో ఇండియన్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్ (ICCW) ప్రతి యేటా సాహస బాలలను ప్రోత్సహించి సత్కరిస్తూంటుంది. ఈ బహుమతులు పొందిన బాలలకు గజారోహణం, ప్రధానమంత్రి చేత బహుమతి ప్రధానం చేస్తూ, ప్రతి యేటా రిపబ్లిక్ దినోత్సవాలలో ఒక భాగంగా జరుగుతూ వస్తున్నాయి.

ఈ ఏడాది ఆ విధంగా బహుమతి పొందుతున్న వారిలో ముగ్గురు తెలుగు బాలలున్నారు.

జూలై 26, 1992న తలిదండ్రుల బలవంతం మీద గండిపేటలోని ఉస్మాన్ సాగర్ సరస్సుకు పిక్నిక్కి వెళ్ళాడు. అనురాగమూర్తి. ఆ సరస్సులో ఇద్దరాడ వాళ్ళు ప్రమాద వశాత్తూ మునిగి పోతూ పెద్దగా కేకలు పెట్టారు. పెద్దలే నిర్ణయమూ తీసుకోలేని స్థితిలో ఉండగా ఈతరాని అనురాగమూర్తి ముందుకు నడి చాడు. ఎయిర్ ఫోర్సు పైలెట్ కావాలనుకున్న ఆ బాల వీరుడు తన దృష్టిని ఆకాశం వైపు నుంచి పాతాళం వైపు మళ్ళించాడా అన్నట్లు నీటిలో దూకాడు. పదమూ డేండ్ల ఆ బాలుడు ఇద్దరు స్త్రీల ప్రాణాలను రక్షించ గలిగాడు. కానీ తన్ను తాను రక్షించుకోలేక నీటిలో కలిసిపోయాడు. 28 గంటల తర్వాత అతడి శవం దొరికింది.

అక్టోబర్ 4,1992 న దూసి సూరిబాబు తన స్నేహితులతో కలసి ఉదయాన్నే జాగింగ్ చేస్తుండగా దూసుకూ వచ్చిందో ట్రక్కు. సూరి బాబు గట్టిగా అరిచి తన మిత్రుల్ని హెచ్చరించాడు. మరి దారి లేదని ఇద్దరు మిత్రుల్ని ప్రక్కకు తోసేశాడు. ఈ

"వసుంధర"



ప్రయత్నంలో పదునాలుగేండ్ల ఆ బాలుడికి తన్ను తాను రక్షించుకునేందుకు సమయం చిక్కలేదు. దూసుకుంటూ వచ్చిన ట్రక్కు దూసి మీదనుంచి వెళ్ళి పోయింది.

సినిమాలు చూసి పిల్లలు బాగుపడుతున్నారనీ, చెడిపోయేది పెద్దలేననీ మువ్వ భాస్కరుని కథ చెబుతుంది. నెక్కొండలో కొందరు తీవ్రవాదులు ఓ ఇంటికి నిప్పంటించారు. హీరో చిరంజీవి వల్ల ప్రభావితుడైన మువ్వ విజయభాస్కర రెడ్డి చిరంజీవి స్టయిల్లో అగ్ని గుండం లాంటి ఆ ఇంట్లో దూకి, లోపల కలయతిరిగి తన వాళ్ళందరినీ దొడ్డిదారిన బయటకు తప్పించ గలిగాడు. ఇల్లంటించిన తీవ్రవాదుల్లోనే ఇద్దరు తప్పించుకోలేక అగ్నికాహుతి అయిన సందర్భంలో ఈ నెక్కొండ చిరంజీవి శరీరంలో సగభాగం కాలి పోయింది. సబినస్పెక్టర్ కావాలనుకుంటున్న ఈ చిరంజీవి ఆశయం ఫలించాలని ఆశిద్దాం. త్రిపురకు చెందిన విప్లవ చక్రవర్తి అనే బాలుడు కూడా ఇదే విధంగా ఒక పిల్లవాణ్ణి మంటల బారి నుండి రక్షించి బహుమతికి అర్హుడయ్యాడు.

జూన్ 17, 1993న గ్వాలియర్‌కు చెందిన ప్రాచీ సబన్ అనే 15 ఏళ్ళ అమ్మాయి తలిదండ్రులతోటీ, తదితరులతోటీ పెళ్ళికి తరలి వెలుతుండగా దారిలో కొందరు బందిపోట్లు ఎదురయ్యారు. వాళ్ళామె తండ్రినీ, బాబాయినీ, చితకబాదుతుంటే ప్రాచీ కొత్తగా నెల రోజుల నుంచీ తాను నేర్చుకుంటున్న జూడో విద్యను దొంగల మీద ప్రయోగించింది. వారిని పదిహేను నిముషాల పాటు ఆమె ఎదుర్కోగలగడంతో ఈ లోగా చుట్టుపక్కల వాళ్ళు వచ్చి దొంగలను పారద్రోలారు. పెద్దయ్యాక పోలీసు కావాలనుకునే ఈ బాలిక ఇప్పటికే పెద్ద పోలీసుల్ని మరిపింపజేస్తోంది.

ఏప్రిల్ 1, 1986లో పుట్టిన ప్రదీప్ చేసిన సాహసం అసామాన్యమైనదైతే అందువల్ల ఎదురైన పరిణామం మరింత అసామాన్యం. ఆగస్టు, 1993లో ప్రదీప్ ఇంట్లో దొంగలు పడ్డారు. ప్రదీప్ సాయుధులైన ఆ ముఠాతో తలపడి ప్రాణాలకు తెగించి మరీ తన ఇంటినీ, తల్లినీ, ఆస్తినీ, కాపాడుకున్నాడు. ఆ వీర బాలుడి కారణంగా ముఠా మనుషుల్లో ఒకరు పోలీసులకు పట్టుబట్టాడు. ముఠా మనుషులకు ప్రదీప్‌మీద మండింది. ప్రదీప్‌ని స్కూల్లో చదవనిస్తే స్కూలు పిల్లలకే ప్రమాదం కలిగిస్తామని ముఠావాళ్ళు బెదిరించడంతో ఢిల్లీకి చెందిన ఆ పాఠశాల అధికారులు భయపడి ప్రదీప్ పేరును రిజిస్టర్లోంచి తీసివేశారు. ఆ విధంగా మూడవ తరగతితో చదువు మానేయాల్సి వచ్చిన ప్రదీప్‌ని దొంగల భయంతో ఏ స్కూలూ చేర్చుకోవడం లేదు. "పారిపోతున్న ఓ దొంగను నేను పట్టుకోగలిగాను. అందుకని వాళ్ళు నామీద పగబట్టారు. నాకు రక్షణ కల్పించలేమని స్కూలు అధికారులంటున్నారు. అని బాధపడుతున్న ప్రదీప్ చదువు బాధ్యతను ICCW తీసుకొంటానని అంటోంది.

అక్టోబర్ 11, 1992న ఏడుగురు బాలికలు గౌరీ పూజా అనంతరం గౌరీ విగ్రహాలను నదిలో కలుపుతుండగా కొట్టె పూర్ణా డామ్‌నుండి ఉన్నట్లుండి నీరు వదల బడింది. ఆ పిల్లల్లో నలుగురిని మాత్రమే రక్షించ గలిగాననీ, ముగ్గురి ప్రాణాలు కాపాడలేననీ బాధపడే నీలేష్ సాహెబ్‌రావు ఉమాలే వయసు 13, తాను ఇంజనీర్ లేక డాక్టర్. కావాలని అతడి ఆశయం. అతని ఆశయం నెరవేరుగాక.

శ్రీనగర్లోని చాణ్‌పురాలో ఆరున్నర సంవత్సరాల భూమిక, ఆమె చిట్టి తమ్ముడు రోహిల్ అంబులెన్సులో స్కూలుకు వెడుతున్నారు. తీవ్రవాదులు అంబులెన్సుల జోలికి వెళ్ళరని భావించిన ఆమె తల్లిదండ్రుల ఊహ నవంబర్ 21. 1990న తప్పయింది. ఆ రోజున AK-47 తుపాకులు అంబులెన్సుపై గుళ్ళ వర్షం కురిపిస్తూంటే భూమిక తమ్ముణ్ణి కాపాడ్డం కోసం వాటిని గట్టిగా వాటేసుకుంది. మూడుగుళ్ళామె వీపులోకి దిగాయి. ఆ విషయమే పట్టించుకోకుండా ఆ చిన్నారి తన చిట్టి తమ్ముణ్ని ఇంటికి చేర్చగలిగింది. శస్త్ర చికిత్సలో ఆమె శరీరం నుంచి తుపాకీ గుళ్ళు వేరు చేయబడ్డాయి. అయినప్పటికీ ఆ గుళ్ళు వెన్నెముక ప్రాంతాల తగులుకొనడంవల్ల భూమిక మామూలు మనిషి కావడానికి చాలా కాలం పట్టవచ్చు.

వీరేన్ మధుకర్ అంబేకర్ తన స్నేహితుణ్ణి రక్షించడం కోసం బావిలోకి దూకాడు. పూనాకు చెందిన ఈ బాలవీరుడి తరహాలోనే ఝార్కెలాకు చెందిన ప్రదోష్ కుమార్ మిశ్రా, కోహిమాకు చెందిన క్యోతుంగో కికోన్, జల్గావ్‌కు చెందిన శంబాజీ దేవ్ చంద్ పాటిల్, ఢిల్లీకి చెందిన మానవకృష్ణన్, పూనాకు చెందిన కవితా అనిల్ గోవాండేలు సాహసాలు చేశారు. విచిత్రమేమంటే వీళ్ళందరికీ భవిష్యత్తు గురించి కచ్చితమైన ఆలోచనలున్నాయి. కొందరు సైన్యంలో చేరాలనీ, కొందరు ఇంజనీర్లు, కావాలని, మరికొందరు డాక్టర్లు కావాలనీ అనుకుంటున్నారు.

సాహసానికి బహుమతి నందుకునే వారందరిలోకీ చిన్నదైన పవిత్ర భోపాల్లో తన స్నేహితుణ్ణి కరెంటు షాకు నుంచి కాపాడింది. లాటూర్ కు చెందిన పరమేశ్వర శివాజీరావు పిచ్‌కేవార్ క్లాస్‌రూంలో తన మిత్రుణ్ణి పొడిచిన నేరస్థుణ్ణి ధైర్యంగా ఎదిరించి, పారిపోకుండా పట్టుకున్నాడు.

ఢిల్లీకి చెందిన సుధీర్‌కుమార్, బరంపురానికి చెందిన లోపాముద్రా పట్నాయక్, దన్‌బాద్‌కు చెందిన మహమ్మద్ ముర్తాజాలు వేర్వేరు చోట్ల ఒకే విధంగా తమ సాహసాల్ని ప్రదర్శించి కొందర్ని రక్షించారు. అందులో సుధీర్ గాయపడలేదు. కానీ ముర్తాజాకు కుడికాలు పోయింది. లోపాముద్ర గత సంవత్సరం ఫిబ్రవరి 22న తన మిత్రుణ్ణి బస్సుకింద పడకుండా కాపాడినా బస్సామె ఎడమ పాదం మీంచిపోయింది. పదమూడేళ్ళ లోపా ముద్రకు వైద్యానికి డబ్బు చాలడం లేదు. ఇంకా అడుగులు వేయలేని స్థితిలో ఉన్న ఆ బాలిక

ఏడాది నుంచి బడికి వెళ్ళడం లేదు. మధ్య ప్రదేశ్‌కు చెందిన అఖిలేష్ కుమార్ శాండిల్య తన ప్రాణాలకు తెగించి మిత్రుణ్ణి రైలు పట్టాల మీదనుంచి కాపాడాడు.

అన్నదమ్ములైన కృష్ణకుమార్ పాండే, అరవింద్ పాండేలు ఏడాది క్రితం అగ్నికి ఆహుతి అవుతున్న తమ యింట్లోంచీ పశువుల మందను కాపాడి అటు సాహసాన్నీ ఇటు జీవ కారుణ్యాన్నీ ఒకేసారి ప్రదర్శించారు.

జనవరి 26, 1994న బహుమతులకు అర్హులైన ఈ 22 గురు బాలల్లో ముగ్గురు మన మధ్య లేరు. వారి ఆత్మశాంతికై భగవంతుణ్ణి ప్రార్థిద్దాం. మిగతా 19 గురినీ వారి సాహసానికీ, ICCWని వారి ప్రోత్సాహనికీ అభినందిద్దాం.

బాలలూ! మనమెవరి నుంచీ నేర్చుకోవద్దు - ఈ బాలవీరులే మనకు ఆదర్శం! అప్పుడే రేపటి పౌరులమని మన గురించి మనం చెప్పుకోగల్గుతాం.



చేపల వేటకు పిట్టలు

జపాన్‌లోని జాలర్లు ఎన్నో ఏళ్ళుగా సముద్రంలో చేపల్ని పట్టటానికి, వల లేక గాలాన్ని ఉపయోగించ టానికి బదులు పక్షుల జాతికి చెందిన 'కార్‌మోరెండ్' అనబడే పిట్టల్ని పెంచి, చేపల వేటకుపయోగించు కుంటున్నారు. ఆ దేశంలో అధిక సంఖ్యలో కనబడే ఈ పిట్టలకు నీటి అడుగు భాగానికి వెళ్ళి చేపల్ని పట్టి వెంటనే ఓడల మీదికి తిరిగి వచ్చేట్టు శిక్షణ ఇవ్వబడుతుంది. ఈ 'కార్‌మోరెండ్' పిట్టలు అవి పట్టుకున్న చేపల్ని వెంటనే మింగివేయడానికి వీలు కాకుండా వాటి గొంతుకల్ని తోలుదారంతో కట్టి, ఆ దారం ఇంకో భాగాన్ని తమ దగ్గర ఉంచుకుంటారు. ఈ పద్ధతిలో ఆ పిట్టలు ఒక్కొక్క చేపనే పట్టి పైకొచ్చి పడవలో చేర్చుతాయి. జాలర్లు తమకు కావలసినన్ని చేపలు చేరిన తర్వాత, ఒడ్డు చేరుకుని ఆ పిట్టలకు ఆకలి తీరేవరకూ కావలిసినన్ని చేపల్ని వాటికి ఆహారంగా పెడతారు.



గాంధర్వ వివాహం

వైశాలీ నగరానికి రాజు వీరేంద్రుడు. ఆయనకు ఒక్కగానొక్క కొడుకు సచరితుడు. అల్లారు ముద్దుగా పెరిగినా అన్ని విద్యలూ నేర్చాడు.

ఒకరోజున సచరితుడు రాజోద్యానవనంలో విహరిస్తున్నాడు. ఆ సమయంలో ఆకాశయానం చేస్తున్న చిత్రరేఖ అనే గంధర్వకన్య అతడిని చూసి మోహించి తోటలో వాలింది.

యువరాజు, చిత్రరేఖ ఒకరినొకరు చూసుకున్నారు. పరస్పరం ప్రేమించుకుని అప్పటికప్పుడు గాంధర్వ వివాహం చేసుకున్నారు.

"నిన్ను నా తల్లిదండ్రులకు పరిచయం చేస్తాను. వాళ్ళెంతో సంతోషిస్తారు, నీ సౌందర్యం చూసి!" అన్నాడు సుచరితుడు.

"మన వివాహం రహస్యంగా ఉంచాలి. నీవు గనుక ఎవరికైనా చెబితే వెంటనే శిలవైపోతావు. జాగ్రత్త!" అని హెచ్చరించి వెళ్ళి పోయింది. చిత్రరేఖ.

ఆ తర్వాత అప్పుడప్పుడు వచ్చి చిత్రరేఖ సుచరితుడితో సుఖంగా గడిపి వెళ్ళి పోతూండేది. ఈ విషయం ఇంకెవరికీ తెలియదు.

ఈ లోగా సుచరితుడిని పెళ్ళాడాలని ఎందరో రాచకన్నెలువ్విళ్ళూరుతున్నారు. ఎన్నో దేశాల నుంచి ఎన్నో సుందరీమణుల చిత్రపటాలు వైశాలీ రాజాంతఃపురం చేరుకుంటున్నాయి. కానీ సుచరితుడు మాత్రం వాటిలో ఒక్కటీ ఎన్నుకోలేదు.

ఇందుకేదో కారణముండాలని భావించిన వాడై, వీరేంద్రుడు కొందరు అంతఃపుర పరిచారికలను యువరాజుపై ప్రత్యేకంగా నిఘా వేయించాడు. వారిలో ఒకతె ఒకరోజు రాత్రి కిటికీ తలుపుల సందుల నుంచి యువరాజు శయన మందిరంలో చిత్రరేఖను చూసి వెంటనే రాజుకు కబురందజేసింది.

వీరేంద్రుడు రాణినీ, రాజభటులనూ తీసుకుని వచ్చి యువరాజు శయన మందిరం తలుపులు తట్టాడు. అలికిడి వింటూనే చిత్రరేఖ, "మన ఉనికి తెలిసిపోయినట్లుంది. నేను వెడుతున్నాను. కొంతకాలల్ల పాటు నేను నీ దగ్గరకు రాను.



నేను చెప్పినమాట గుర్తుంచుకో మన వివాహం విషయం గుర్తించుకో" అని సుచరితుణ్ణి హెచ్చరించి మాయమయింది.

వీరేంద్రుడికీ రాజభటులకూ ఎంత వెదికినా శయన మందిరంలో ఎవరూ కనబడలేదు. రాజు, రాణి ఎంత ప్రయత్నించినా సుచరితుడు నోటి నుంచి ఏ విషయమూ తెలుసుకోలేక పోయారు.

ఈ లోగా చిత్రరేఖ రహస్య ప్రేమ కలాపం గంధర్వ రాజుకు తెలిసింధి. ఆయన చిత్ర రేఖను మానవకాంత కమ్మని శపించాడు. ఆమె ఆ విధంగా భూలోకంలో మరుద్వతి అనే నర్తకి ఇంటి ముంగిట పడింది. ఆమెకు పూర్వస్మృతి పూర్తిగా పోవడంవల్ల తానెవరో ఎవరికీ చెప్ప లేకపోయింది. మూడు మాసాల గర్భవతిగా ఉన్న ఆమెను మరుద్వతి చేరదీసింది.

కొన్నాళ్ళకు చిత్రరేఖ పండంటి బిడ్డను కన్నది. మరుద్వతి ఆమెతో, "నీవు అప్సరసలను మించిన అందగత్తెవు. నీకు నాట్యం నేర్పుతాను. ఆ తర్వాత బోలెడు డబ్బు సంపాదించవచ్చు" అని చెప్పింది.

చిత్రరేఖ సంవత్సరకాలంలోనే నాట్య శాస్త్రంలోని మెలకువలన్నీ నేర్చుకో గలిగింది. అందుకు మరుద్వతి ఆశ్చర్యపడి, "నేను నీకివి నేర్పానా, లేక అన్నీ నీకే సహజంగా వస్తే గుర్తు చేస్తున్నానా?" అనిపిస్తోంది అంది.

ఈ లోగా సుచరితుడు చిత్రరేఖ కనిపించక బెంగతో కృశించిపోసాగాడు. అది చూసి రాజు, రాణి దిగులుపడ్డారు. ఏమి చేయాలో తోచక వీరేంద్రుడు మంత్రి కులదీపుడిని పిలిచి, "ఏదో విధంగా నా కుమారుడి నోటి నుంచి అతడిలో దాగి ఉన్న రహస్యాన్ని కక్కించి, అతణ్ణీ, ఈ రాజ వంశాన్నీ కాపాడండి" అని కోరాడు.

కులదీపుడు తన చాతుర్యంతో యువరాజు మనసు గెల్చుకున్నాడు. సుచరితుడాయనకు తన కథ అంతా చెప్పి శిలగా మారిపోయాడు.

ఈ పరిణామానికి కులదీపుడు నివ్వెరపోయి రాజుకు నివేదించాడు. రాజు, రాణి శిలగా మారిన కొడుకు కోసం కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఈ లోగా కులదీపుడు సమీపారణ్యానికి వెళ్ళి అక్కడుండే తేజస్వి అనే మహర్షిని కలుసుకుని

సుచరితుడి దీన గాథను చెప్పాడు.

తేజస్వి తన దివ్య దృష్టిలో జరిగినదంతా తెలుసుకుని "విధి బలీయం, ఇందులో నా ప్రమేయం కూడదు. ప్రస్తుతం చిత్రరేఖ శాపగ్రస్థురాలై మానవకాంతగా మారి పూర్వస్మృతి లేక భూమ్మీద ఎవరి ఆశ్రయంలోనో ఉంటోంది. ఆ వివరాలు నేను చెప్పకూడదు. కానీ సుచరితుడికి తన బిడ్డ స్పర్శ లభించిన రోజున అతడికి యథారూపం వస్తుంది'' అన్నాడు.

"అయితే చిత్రరేఖ ఆచూకీ తెలుసుకునే మార్గమేమిటి?'' అని కులదీపుడు తేజస్విని ప్రశ్నించాడు.

"సుచరితుడి శిలా విగ్రహం ముందు రోజుకొక కొత్త సుందరి అపురూపంగా నాట్యం చేసే ఏర్పాటు చేయించు. శుభం జరుగుతుంది'' అన్నాడు తేజస్వి. కులదీపుడు తిరిగివెళ్ళి రాజుకు జరిగినదంతా చెప్పాడు. ఆయన వెంటనే శిలా విగ్రహం ముందు నాట్య ప్రదర్శన గురించి ప్రకటన చేయించాడు

రాజుగారిచ్చే కానుకలపై ఆకర్షణతో ఎందరో అందగత్తెలు ప్రతిరోజూ శిలా విగ్రహం ముందు నాట్యం చేయసాగారు. వారి వారి నాట్య భంగిమలెంత గొప్పగా ఉండేవంటే రాజాంతఃపురంలోని స్త్రీ పురుషులందరూ ఆ నాట్యం చూడ్డానికి విరగబడుతూండేవారు.

అలా ఒక సంవత్సరం గడిచింది.

నాట్యం వృత్తిగా స్వీకరించే ఆడవాళ్ళు తక్కువగా ఉంటారు. నాట్యం నేర్చుకున్న కుటుంబ స్త్రీలు ఇతరుల ముందు నాట్య ప్రదర్శన చేయడాని కిష్టపడరు. అందువల్ల సుచరితుడి శిలా విగ్రహం

ముందు నాట్యం చేయడానికి యువతులు దొరకడం కష్టమయింది. అందులోనూ ఈ రోజు నాట్యం చేసిన యువతి రేపటికి పనికి రాదు కదా!.

కులదీపుడు రాజధానీ నగరంలోని ప్రముఖ నర్తకి అయిన మరుద్వతిని పిలిచి పరిస్థితిని వివరించి చెప్పి, "రోజు కొక కొత్త యువతి శిలా విగ్రహం ముందు నాట్యం చేయాలి. దేశంలో ఎక్కడెక్కడి కొత్త వారినీ సేకరించి నాట్యం నేర్పి మా వద్దకు పంపే బాధ్యత నీది. నీ బాధ్యతను నీవు సక్రమంగా నిర్వహించేవా నీకు గొప్ప బహుమానం. లేదా కఠిన శిక్ష! రేపటినుండే నాట్యం చేయడానికి యువతులను పంపడం ప్రారంభించు" అని చెప్పాడు.

ఇది విని మరుద్వతి నివ్వెరపోయింది. ముందుగా రేపటికో సుందరి కావాలి. వేరే దారి లేక ఆమె చిత్రరేఖను కోరింది. ఇతరుల ముందు నాట్యం చేయడానికి చిత్రరేఖ అంగీక రించలేదు. కానీ తన ప్రాణదాత అయినందుకూ, ఇంతకాలమూ తన్ను పోషించినందుకూ కృతజ్ఞతగా చివరికామె అంగీకరించింది.

అయితే చిత్రరేఖ కుమారుడామెను వదిలి ఒక్క క్షణం కూడా ఉండడు. మరుద్వతి వాడిని తీసుకుని చిత్రరేఖతో బయల్దేరింది.

శిలా విగ్రహం ముందు చిత్రరేఖ చేసిన గంధర్వ నాట్యానికి అంతఃపుర వాసులందరూ దిగ్భ్రాంతులయ్యారు. ఆ సమయంలో చిత్రరేఖ కొడుకు తల్లి కోసం తపిస్తూ మరుద్వతి విడిపించుకుని పారిపోతూ శిలా విగ్రహాన్ని తగులుకుని పడిపోయి కెవ్వుమని అరిచాడు. అంతే - నాట్యంలో రసభంగమయింది. మహారాజు కళ్ళెర్రబడ్డాయి. కానీ అదెంతసేపు?

కుమారుడి స్పర్శ కాగానే సుచరితుడు మామూలు మనిషై చప్పున వాడిని లేవదీశాడు. సుచరితుణ్ణి చూస్తూనే చిత్రరేఖకు పూర్వ స్మృతి కలిగింది.

ఆ తర్వాత సుచరితుడు ఎంతో కాలం భార్యా బిడ్డలతో హాయిగా జీవించాడు.



ప్రతిభ

ఒకానొకప్పుడు కాంచీపురంలో పరమధామయ్య అనే భూస్వామి ఉండేవాడు. శ్రీధరుడు, శ్రీకరుడు, శేఖరుడు ఆయన కొడుకులు. ముగ్గుర్నీ బడికి పంపితే పెద్దవాళ్ళిద్దరూ బుద్ధిగా చదువుకుని మంచిపేరు తెచ్చుకున్నారు. చివరివాడైన శేఖరుడు మాత్రం పాఠాలు సరిగ్గా చదవక గుర్రపుస్వారి మీదనే ఎక్కువగా ఆసక్తి చూపేవాడు.

ఈ విషయం పరంధామయ్యకు తెలిసింది. ఆయన నయానా భయానా కొడుక్కు చెప్పిచూశాడు. అయినవాళ్ళ చేత చెప్పించాడు.

శేఖరుడు ఎవరి గుర్రం దొరికితే వారి గుర్రాన్నెక్కి కాసేపు గుర్రపు స్వారీ చేసి వినోదించేవాడు.

అదేమి చిత్రమో ఎంత కొత్త గుర్రమైనా వాడికొట్టే లొంగిపోయేది.

శేఖరుడి ఆగడాలు భరించలేక బడిపంతుళ్ళు వాడిని చదువుకు పనికిరాడని నిర్ణయించారు. ఇది తెలిసి పరంధామయ్య కూడా కొడుకుని అసహ్యించుకుని, "బాగా చదువొచ్చేదాకా నువ్విల్లు కదలడానికి వీల్లేదు" అంటూ ఇంట్లోనే ఓ గదిలో ఉంచి తలుపులు వేశాడు.

ఆ విధంగా శేఖరుడిది ఖైదు జీవితమయింది. అందుకు వాడు తనలో తాను కుమిలిపోతూండేవాడు.

ఇలా ఉండగా వాళ్ళింటికి మేనమామ భాస్కరుడు వచ్చి శేఖరుడి విషయం తెలుసుకున్నాడు. ఆయన వాడిని కలుసుకుంటే వాడు భోరున ఏడ్చి, "నేను చేసిన తప్పేమిటో తెలియడంలేదు. నాకు చదువంటే ఇష్టం లేదు. గుర్రపుస్వారీ ఇష్టం. అందరూ నన్ను తిట్టి వేళాకోళం చేస్తున్నారు" అని ఏడ్చాడు.

భాస్కరుడు వాడిని మరికొన్ని ప్రశ్నలు వేశాక పరంధామయ్యను కలుసుకుని, "బావా! శేఖరుడిని నాతో పంపించు. వాణ్ణి నేను గొప్పవాణ్ణి చేస్తాను" అన్నాడు.

"నీ మీద నాకు నమ్మకముంది. కానీ, వాడు మహా మొండిమనిషి. ఎన్ని చెప్పినా తన సరదా తనదే కానీ చదువుకోడు. వాడినెలా మార్చుతావో

పూనమల్లి పుష్పభాను

మరి!'' అంటూనే పరంధామయ్య శేఖరుణ్ణి ఆయనతో పంపడానికి ఒప్పుకున్నాడు.

అలా పదేళ్ళు గడిచాయి. శేఖరుడు బాగు పడుతున్నట్లు భాస్కరుడినుంచి పరంధామయ్యకు కబురందుతోంది. ఈలోగా శ్రీధరుడు, శ్రీకరుడు చదువులు పూర్తి చేసుకుని తమ తమ తెలివి తేటలతో నెలకు వెయ్యి వరహాలు చొప్పున సంపాదిస్తూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

శేఖరుడి ప్రతిభ చూడ్డానికి రమ్మనమని భాస్కరుడి నుంచి కబురు వస్తే ఇంటిని పిల్లలిద్దరికీ అప్పజెప్పి పరంధామయ్య పట్నం వెళ్ళాడు. అప్పటికి శేఖరుడు ఏపుగా ఎదిగి అందంగా ఉన్నాడు తప్ప చదువేం పెద్ద వంటబట్టినట్లు లేదు. అయితే, ఆ సాయంత్రం నగరంలో గుర్రపు స్వారీల పోటీలు జరిగాయి. అందులో శేఖరుడు ప్రథముడిగా వచ్చి యాభైవేల వరహాల బహుమతిని గెల్చుకున్నాడు.

ఆ పోటీలు చూడ్డానికి రాజధాని నుంచి వచ్చిన రాజప్రతినిధి శేఖరుణ్ణి మెచ్చుకుని, "నీ ప్రతిభ అద్భుతం. మన దేశంతరఫున నీవు విదేశాలు వెళ్ళి పోటీల్లో నెగ్గిరావాలి. విజయం సాధిస్తే నీకు పదిలక్షల వరహాల బహుమతి ఉంటుంది'' అన్నాడు.

ఇదంతా చూసిన పరంధామయ్య, "నేను, వీడి అన్నలు జీవితమంతా ధారపోసినా ఇంత డబ్బు ఒక్కసారిగా సంపాదించడం సాధ్యం కాదు. వీడింతవాడెలాగయ్యాడు?'' అని ఆశ్చర్యపడ్డాడు.

భాస్కరుడు నవ్వి, "చదువంటే పుస్తకాలు చదవడం మాత్రమే కాదు. చిన్నతనంనుంచీ పిల్లలకున్న ఆసక్తిని గుర్తించి వారి ప్రతిభకు తగ్గ విద్య చదివించి ప్రోత్సహిస్తే - వారు తప్పక రాణిస్తారు. మన శేఖరుడికి గుర్రపుస్వారీలో ఉన్న ప్రతిభను అర్థం చేసుకుని నేను వాడికి తగిన శిక్షణనిప్పిస్తే ఇప్పుడింతటి వాడయ్యాడు. పిల్లలకు వచ్చిందాన్ని ప్రోత్సహించాలి. రానిదానికి నిరుత్సాహ పర్చకూడదు'' అంటూ పరంధామయ్యకు చెప్పాడు.





డబ్బు మొక్క

సీనూకి పంచదార చిలక కొనుక్కు తినాలనుంది. అమ్మనడిగితే, "చెట్టుకేమన్నా డబ్బులు కాస్తున్నాయనుకున్నావా?" అంటూ కసిరింది.

అప్పుడు సీనూ చిన్న ముఖం చేసుకుని తన ఇంటి పెరట్లోకి వెళ్ళి చూస్తే జాజులు పూశాయి. జామి పిందెలు వేశాయి. మామిడాకులు ఎఱ్ఱబడ్డాయి.

"చెట్లకు డబ్బులు కాస్తే ఎంత బాగుండును?" అనుకుంటూ సీనూ వీధిరుగు మీదకు వస్తే ఆ దారిన అప్పుడే మొక్కలమ్మేవాడొక డలా పోతున్నాడు.

సీనూ వాడిని పిలిచి, "డబ్బులు కాసే మొక్కలున్నాయా?" అనడిగాడు.

"ఉన్నాయి" అంటూ వాడో మొక్కనిచ్చాడు. సీనూ తల్లిని బ్రతిమాలి ఆ మొక్కను కొనిపించుకుని దొడ్లో పాతాడు.

అది పెరిగి పెద్దది కాగానే దానికి నిజంగానే డబ్బులు కాయడం మొదలయింది.

మొదటి కాపు సీనూయే కోసుకుని పంచదార చిలకలు కొనుక్కుని తిన్నాడు.

ఆ తర్వాత చెట్టు నిండా డబ్బులు కాస్తే సీనూ చేతులు నిండాయి. ఇంట్లో పెట్టెలు నిండాయి.

దొడ్లో ఒకటికి రెండు, రెండుకు నాలుగు చెట్లయ్యాయి. వాటికోసం దొడ్లో ఉన్న మిగతా చెట్లను కొట్టించేశాడు సీనూ నాన్న. ఇంటి నిండా బోలెడు డబ్బు.

అలా మూడేళ్ళు గడిచాయి. ఒక రోజున సీనూ డబ్బులు తీసుకుని దుకాణానికి వెడితే ఎక్కడా కందిపప్పు దొరకలేదు. ఆ రోజుకు వాళ్ళింట్లో పప్పు లేకుండానే భోంచేశారు.

రెండ్రోజులు పోయాక సీనూకి ఏ దుకాణంలోనూ బియ్యం దొరకలేదు. ఇంట్లో బొత్తిగా బియ్యం అయిపోయాయి.

మామూలుగా అయితే తెలిసిన రైతొకడు వాళ్ళకు ధాన్యం, పప్పులు అన్నీ ఇస్తాడు.

ఈసారి వాడింతవరకూ రాలేదేమని సీనూ నాన్న రైతు ఇంటికి వెడితే — ధాన్యం వాడి

శింగిసెట్టి సంజీవరావు

దగ్గరా లేవు.

అదేమని ఆ రైతును అడిగితే తన పొలంలో ధాన్యం, పప్పులు బదులు డబ్బుల మొక్కలు వేశానన్నాడు.

ఆ రైతుకు బోలెడు డబ్బులు కాసి గాదెలు నిండిపోయాయి.

ఎవరింట్లో చూసినా డబ్బులే, ఎక్కడా తిండి సరుకు లేదు.

ఇంటికి నీరసంగా వెడుతూంటే సీనూకి డబ్బులమ్మే మనిషి కనిపించాడు.

వాడు సీనూని చూసి ఆశగా, "సోలెడు డబ్బులిస్తాను. సోలెడు బియ్యం ఇస్తావా?" అనడిగాడు.

సీనూ తెల్లమొహం వేసుకుని ఇల్లు చేరాడు. ఆ రోజుకు ఇంట్లో వంటలేదు.

అప్పుడు సీనూ వీధరుగు మీద కూర్చుని ఏమైనా అమ్మేవాళ్ళు దొరుకుతారేమోనని చూస్తున్నాడు. కానీ డబ్బులమ్మే వాళ్ళే వస్తున్నారు.

కాసేపటికి మొక్కలమ్మేవాడు వచ్చాడు.

"ఏం కావాలి?" అన్నాడు మొక్కలమ్మేవాడు.

"డబ్బులు కాసేవి తప్ప మిగతా మొక్కలన్నీ రకానికొక్కటి కావాలి" అన్నాడు సీనూ.

మొక్కలమ్మేవాడలాగే ఇచ్చి వెళ్ళాడు.

ఆ తర్వాత అందరిళ్ళలో ధాన్యం, పప్పులు, పళ్ళు - అన్నీ పండాయి. అందరూ సంతోషంగా ఉన్నారు.

అప్పట్నించీ జనం డబ్బుల మొక్కలంటే హడలిపోతున్నారు.

క్రమంగా డబ్బులు కాసే మొక్కల విత్తనాలు ఎక్కడా లేకుండా హరించుకు పోయాయి. అయినా ఎవరూ విచారించలేదు. ఎందుకంటే డబ్బుల మొక్కలంటూ ఉంటే అంతా ఆ మొక్కలే వేయాలనుకుంటారు. అంతా డబ్బులే పండించాలనుకుంటారు. కానీ ధాన్యం, పప్పులు, పళ్ళు కడుపునింపినట్లు డబ్బులు కడుపు నింపవు కదా!



గుట్టులేని వైద్యం

శాకల్యుడనే గురువు వద్ద అనిరథుడు, కుముదుడు అనే వాళ్ళు కూలంకషంగా వైద్య విద్యనభ్యసించి తమ తమ గ్రామాలకు వెళ్ళారు. కొంతకాలం గడిచేక అనిరథుడు స్వగ్రామమైన అనంతపురంలో గొప్ప వైద్యుడిగా పేరు తెచ్చుకున్నాడు.

కుంతీపురంలో ఉంటున్న కుముదుడు మాత్రం వైద్యుడిగా పెద్ద పేరు తెచ్చుకోలేక పోయాడు. అతడి గ్రామస్థులు కూడా చాలామంది అనిరథుడి వద్దకే వెడుతూండే వారు వైద్యం నిమిత్తం.

అందుకు కారణం తెలుసుకోవాలని కుముదుడు ఎన్నో విధాల ప్రయత్నించాడు. తన వైద్యంలో లోపముందా అంటే అతడి వద్ద మందు తీసుకున్న వారందరికీ చక్కగా నయమవుతోంది. తన దగ్గర సగంలో వైద్యం మాని అనిరథుడి వద్దకు వెళ్ళినవారికి అతడూ తనిచ్చిన మందులే ఇస్తున్నాడు.

చివరకు గురువైన శాకల్యుడిని కలుసుకున్నాడు కుముదుడు.

విషయం తెలుసుకున్న శాకల్యుడు, "వైద్యానికి హస్తవాసి కూడా ఎంతో ముఖ్యం. బహుశా నీది అదే లోపమయుంటుంది'' అన్నాడు.

"హస్తవాసి మెరుగవాలంటే నేనేం చేయాలి?'' అనడిగాడు కుముదుడు ఆత్రుతగా.

"నువ్వు చేయగలిగిందేమీ లేదు. అదృష్టం కలసి వచ్చేదాకా ఎదురుచూడు" అన్నాడు శాకల్యుడు.

"గురువర్యా! నాదొక చిన్న సందేహం. నా విషయంలో హస్తవాసి అసలు కారణం కాదని నాకు అనుమానంగా ఉంది. నేను నా గురించి గొప్పగా ప్రచారం చేసుకోలేదు. వైద్యానికి ప్రచారం అవసరం. అనిరథుడు తన గురించి గొప్పగా ప్రచారం చేసుకొనడమేకాక నా గురించి దుష్ప్రచారంగానీ చేయడం లేదు కదా!" అని సంకోచిస్తూనే చెప్పాడు కుముదుడు.

"నాకు తెలిసి అనిరథుడలాంటివాడు కాదు. అయినా అతడినొకసారి కలుసుకుని పరిశీలించి నీ దగ్గరకు వచ్చి అన్నీ చెబుతాను. ప్రస్తుతానికి

ప్రగడ త్రిశేష

నీవు నీ గ్రామానికి తిరిగి వెళ్ళు'' అన్నాడు శాకల్యుడు.

కుముదుడు కుంతీపురం వెళ్ళి ఎప్పటిలాగే వైద్య వృత్తిని కొనసాగిస్తున్నాడు. కొద్ది రోజుల్లోనే శాకల్యుడతడిని చూడ్డానికి వచ్చాడు.

అప్పుడే రోగి ఒకడు కుముదుడి కోసం వచ్చాడు. శాకల్యుడు శిష్యుడి వైద్య విధానం గమనించాడు.

కుముదుడు రోగిని వ్యాధి లక్షణాలడిగాడు. తను కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టాడు. కాసేపాలోచించి వాడికేదో మందిచ్చి, "చూడు నీ కిచ్చిన మందు చాలా శక్తివంతమైనది. మూడు పూటలు వాడేవంటే చాలు చేత్తో తీసినట్లు నీ రోగం మాయమవుతుంది. నీకు నా మందుమీద నమ్మకం లేకపోతే మన గ్రామాధికారి నడుగు. ఆయనకు సరిగ్గా ఇలాంటి జబ్బే చేస్తే నేను మందిచ్చాను. ఈ మందుకు వెంటనే తగ్గి పోయిందని ఆయనే నీకు చెబుతాడు'' అని చెప్పాడు.

రోగి వెళ్ళిపోయాక శాకల్యుడు కుముదుడితో, "నీ దగ్గరకు వచ్చేరోగులెందుకు తగ్గి పోతున్నారో నాకు అర్థమయింది. నీకు గుట్టు తెలియదు. గ్రహించావా?'' అన్నాడు.

కాదన్నట్లు తల అడ్డంగా ఊపాడు కుముదుడు.

"ఆరోగ్యమే మహాభాగ్యమంటారు. అందుకే ఏ మనిషీ తన జబ్బు గురించి ఎవరికీ చెప్పుకోడు. నీదగ్గరకు వచ్చిన రోగుల రోగం గుట్టు నీవు రట్టు చేసి అందరికీ ప్రచారం చేస్తున్నావు. ఒక్కసారి నీ దగ్గరకు వస్తే తమ జబ్బులగురించి ప్రచారమై పోయిందని భయపడి ఒక్కొక్కరే నీకు దూరంగా వెడుతున్నారు. అనిరథుడికి గుట్టెక్కువ. కాబట్టి లోపం నీ చేతిలో కాదు, నోటిలో ఉంది'' అన్నాడు శాకల్యుడు.

అసలు విషయం తెలియడంతో కుముదుడు తన లోపాన్ని సవరించుకుని క్రమంగా తనూ రోగుల రోగాల సంగతి గుట్టుగా ఉంచి, అనిరథుడంత పేరు తెచ్చుకున్నాడు.





బ్రహ్మపుత్రులు

సృష్టి ప్రారంభించినపుడు బ్రహ్మదేవుడికి స్త్రీ వ్యామోహం లేదు. అందుకని ఆయన పెళ్ళి చేసుకోలేదు. సృష్టికర్త అయిన బ్రహ్మకూ ఒక భార్య ఉండాలని దేవతలందరూ అనుకునేవారు.

ఒకరోజున బ్రహ్మ అందమైన యువతిని సృష్టించి ఆమెకు సరస్వతి అని పేరు పెట్టి సకలవిద్యలూ అమిత శ్రద్ధతో నేర్పసాగాడు. ఆమె చదువుల రాణి కావాలని ఆయన కోరిక.

క్రమంగా బ్రహ్మ సరస్వతికి దగ్గరవుతూండడం గమనించిన దేవతలు అదే అదనని ఆమెను బ్రహ్మవాణిగా ఆరాధించడం మొదలుపెట్టారు. ఆ విధంగా సరస్వతికి వాణి అన్నపేరు వచ్చింది. ఆమెను కొన్నాళ్ళకు పెళ్ళాడి బ్రహ్మదేవుడు వాణీ నాథుడయ్యాడు.

తను సృష్టించిన సరస్వతిని పెళ్ళాడేక బ్రహ్మలో స్త్రీ వ్యామోహం పెరిగింది. ఆయన ఒకసారి స్వర్గానికి వెళ్ళి అక్కడి రంభాది అప్సరసలను చూసి, "వీరందరూ నాచేత సృష్టింపబడిన వారే! వీరిని నేను పెళ్ళాడితే ఎంత బాగుండేది?" అనుకున్నాడు. కానీ, కొసేపటికి మోహం నశించి తన ఆలోచనకు సిగ్గుపడ్డాడు. ఆ సిగ్గులోంచీ బ్రహ్మకు వాలఖిల్యులు పుట్టారు.

బ్రహ్మ మోహం అంతటితో ఆగలేదు. ఒకసారి మన్మథుని భార్య అయిన రతీదేవిని చూడగానే ఆయనలో ప్రేమ పుట్టింది. బ్రహ్మ మాట్లాడేలోగ రతీదేవి అక్కణ్ణించి వెళ్ళిపోయింది. బ్రహ్మ ఆమెననుసరించాలన్న తత్తరపాటులో తను కట్టుకున్న బట్టనే కాలువేసి తొక్కాడు. బట్ట చిరిగింది.

అందుకు బ్రహ్మ చింతించి ఆ బట్టను విప్పి వేరేది కట్టుకున్నాడు. విప్పిన బట్టను అగ్నిదేవుడు కాల్చబోగా - అది కాలిపోకూడదని ఆయన దాని పై నీరు చల్లాడు. కాసేపటికి అగ్ని నీటిలో కరిగిపోయి ఆరిపోగా ఆ బట్టలోంచీ వరుణుడు పుట్టాడు.

మరొక రోజున బ్రహ్మ అమోఘ అనే అందాల రాసిని చూశాడు. ఆమె శాంతనువు అనే మునికి

అపూర్వ గాథలు

పత్ని. మహా పతివ్రత. ఆశ్రమంలో ముని లేనప్పుడు బ్రహ్మ ఆమె వద్దకు వెళ్ళి, "ఓ అమోఘా! నువ్వంటే నాకు ప్రేమ పుట్టింది. నన్ను పెళ్ళి చేసుకుంటే భూమ్మీద నీ పేరు శాశ్వతం చేస్తాను" అన్నాడు.

ఆయన బ్రహ్మదేవుడని అమోఘ గుర్తుపట్టింది. అయినా తెలియనట్లు నటించుతూ, "నన్ను బ్రహ్మదేవుడు సృష్టించాడు. నేనాయనకు కూతురు వరస అవుతాను. ఆయనే స్వయంగా వచ్చి, "ఓ అమోఘా! నేను నా కూతురు వరసైన సరస్వతిని పెళ్ళిచేసుకున్నాను. అలాగే నిన్నూ పెళ్ళి చేసుకుంటాను" అని అడిగినా పెళ్ళికి ఒప్పుకోను. నువ్వొక లెక్కా? పతివ్రతల జోలికి రాక బుద్ధిగా మసలడం నేర్చుకో" అని నేర్పుగా మందలించి వెళ్ళిపోయింది ఆశ్రమం లోపలకు.

ఈ మాటలతో బ్రహ్మకు వివేకం మేల్కొన్నది. ఆయన తలవంచుకుని అక్కణ్ణించి తిరిగి వెళ్ళి పోయాడు.

ఈలాగా శాంతనువుడు ఆశ్రమానికి తిరిగి వచ్చి భార్యద్వారా జరిగినదంతా తెలుసుకున్నాడు. అప్పుడాయన బ్రహ్మదేవుడినుద్దేశించి ప్రార్థిస్తూ, "ఓ దేవదేవా! ఈ సకల చరాచర ప్రపంచానికీ సృష్టికర్తవు నీవు. సమస్త ప్రాణులలోనూ ఉన్నట్లే నాలోనూ నీ అంశ ఉంది. అయితే, నీవు నా భార్యను కోరావు. భగవంతుడివైన నీ కోర్కెలోనూ, పతివ్రత అయిన ఆమె తిరస్కారంలోనూ కూడా తప్పులేదు. నీ కోర్కె తీరే ఉపాయం నేనొకటి చెబుతాను. ఇప్పటికే బ్రహ్మపుత్రులెందరో ఉన్నారు. కానీ, నాకూ, నా భార్యకూ పుట్టిన బిడ్డ బ్రహ్మపుత్ర నామధేయంతో ప్రసిద్ధి చెందే విధంగా వరమివ్వు" అని కోరాడు.

ఇందుకు బ్రహ్మ ఎంతో సంతోషించి, "తథాస్తు" అన్నాడు.

శాంతనువుడికి, అమోఘకు పుట్టిన బిడ్డ నదీ ప్రవాహమై బ్రహ్మపుత్రా నదిగా లోక ప్రసిద్ధి కాంచింది.

—జె. మార్కండేయులు



కుండలో ఏముంది?

అవంతీ దేశపు రాజు విచిత్ర వర్ధనుడు రాజ్య వ్యవహారాలు పట్టించుకోవడం మానేసి విలాసాల్లో మునిగి తేలుతున్నాడు. మంత్రి ఆదిత్య వర్మకిదెంతో బాధగా ఉంది. ఆయన ఎన్నిసార్లు రాజుకి చెప్పినా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లే అయ్యేది.

ఒకరోజున విచిత్రవర్ధనుడు మంత్రిని పిలిచి, "మన యువరాజుకు పదేళ్ళు నిండబోతున్నాయి. ఈసారి జన్మదినం కొత్తరకంగానూ, మహావైభవం గానూ జరపాలి. ఆ రోజు దేశమంతా పచ్చ తోరణాలతో ముగ్గువాకిళ్ళతో కళకళలాడాలి. సభలో ఇంతవరకూ కనీవినీ ఎరుగని కొత్తరకం పోటీ నిర్వహించి విజేతకు వెయ్యి వరహాలు బహుమతిగా ఇవ్వాలి. ఇప్పట్నించీ ఏర్పాట్లు ప్రారంభించండి'' అని చెప్పాడు.

ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని మహారాజుకు కనువిప్పు కలిగించాలని ఆదిత్యవర్మ అనుకున్నాడు.

యువరాజు జన్మదినం రానే వచ్చింది. ఏర్పాట్లన్నీ ఘనంగా జరిగాయి. దేశమంతటా వేడుకలు జరిగాయి.

సాయంత్రం మహారాజు పెద్ద సభ ఏర్పాటు చేశాడు. ఆ సభకు నగర ప్రముఖులు, నాగరికులు పలువురు వచ్చారు. ఇసుక వేస్తే రాలనంతగా క్రిక్కిరిసి ఉన్న ఆ సభనుద్దేశించి మాట్లాడుతూ మహామంత్రి ఆదిత్యవర్మ ఇలా గన్నాడు: "ఇప్పుడు మీ ముందుకు వాసెన కట్టిన కుండ ఒకటి తేబడుతుంది. ఆ కుండకు ఆరడుగుల ధూరంలో నిలబడి అందులో ఏముందో చెప్పాలి. తప్పు చెప్పినవారికి పది కొరడా దెబ్బలు శిక్ష. సరిగ్గా చెప్పిన వారికి వెయ్యి వరహాలు బహుమానం."

మంత్రి మాటలు పూర్తికాగానే రాజభటుడొకడు వాసెన కట్టిన కుండను తెచ్చి, సభలో ఒక బల్ల మీద చుట్టకుదురునుంచి దాని మీద కుండనుంచాడు. దాన్ని చూసిన సభికులు వెయ్యి వరహాల బహుమానం కంటె పది కొరడా దెబ్బల శిక్షకు ఎక్కువగా భయపడ్డారు. అందుకే ఎవరూ ముందుకు రాలేదు.

టి. చంద్రశేఖర్

ఇక పోటీలో ఎవరూ పాల్గోనట్లే నని అను కునేటంతలో ఒక ముసలివాడు ముందు కొచ్చి, "ఇంతమంది ఉన్నారు. ఆ కుండలో రాళ్ళు తప్ప మరేమీ ఉండవని ఒక్కరైనా ఎందుకు చెప్పలేకపోతున్నారో నాకు అర్థం కాకుండా ఉంది. చూసి చూసి చివరకు నేనే ముందు కొచ్చాను" అన్నాడు.

వాసెన విప్పి చూస్తే కుండలో ఉన్నవి రాళ్ళే!

విచిత్రవర్ధను డాశ్చర్యపడి, "ఆ కుండలో ఏమున్నదో ఇంత సులభంగా ఎలా ఊహించావు?" అనడిగాడు.

"నేను అబద్ధం చెప్పలేను. నిజం చెబితే మీరు శిక్షించనని మాటివ్వండి చెబుతాను" అన్నాడు వృద్ధుడు.

కుతూహలం కొద్దీ రాజు ఆ వృద్ధుడికి శిక్షించనని మాటిచ్చాడు.

"మహాప్రభూ! మీ విందులకూ, వినోదాలకూ, వేడుకలకూ, విలాసాలకూ ఎంత డబ్బూ చాలడంలేదు. కాబట్టి ఆ కుండలో డబ్బులుండవు. అటువానలు లేక ఇటు నీటిపారుదల సౌకర్యాలు లేక దేశంలో చెరువులన్నీ ఎండిపోయాయి కాబట్టి అందులో నీళ్ళుండవు. పంటలు చాలా ఏళ్ళుగా సరిగ్గా పండడం లేదు కాబట్టి అందులో ధాన్య ముండదు. సరైన మేత లేక పాడి పశువులు పోయాయి కాబట్టి అందులో పాలుండవు. ఇలా చూసుకుంటూ పోతే అందులో రాళ్ళు తప్ప ఇంకేమీ ఉండే అవకాశం లేదని ఎవరికైనా స్ఫురించి తీరాలి" అన్నాడు వృద్ధుడు.

అంతా ఇది విని నవ్వారు. ముందు కోపం వచ్చినా ఆ ముసలివాడు చెప్పిన మాటల్లో నిజముందని తెలియగానే విచిత్రవర్ధనుడు తన తప్పు తెలుసుకుని — వృద్ధుడికి అన్న ప్రకారం వెయ్యి వరహాలూ కాక అదనంగా మరో పదివేల వరహాలు కానుకగా ఇచ్చి — ఆ రోజు నుంచీ విలాసాలు విడిచిపెట్టి ప్రజారంజకంగా రాజ్యం పాలించాడు.





11

[అమరుక దేశంలో భూకంపంనుంచీ, అక్కడి సైనికుడి బారినుంచీ తప్పించుకుని విచిత్రుడు, ఆనందుడు రసమయదేశం చేరుకుని కారాగారం పాలై ఆదేశం పరిస్థితులు తెలుసుకుంటారు. అప్పుడు ఆనందుడికి విచిత్రుడే రసమయ గూఢచారిలా అగుపించాడు.......... ఆ తర్వాత]

విచిత్రుడికి ఆనందుడి చూపులు నచ్చలేదు. అతడు వృద్ధుని వైపు తిరిగి, "బాటపై పౌరు లొకరితో ఒకరు మాట్లాడకపోవడం చూశాను. అందుకిదేనా కారణం?" అనడిగాడు.

"అవును. మా పౌరులకు ఒకరిపై ఒకరికి అనుమానం. ఒకరంటే ఒకరికి భయం. మనసు విప్పి మాట్లాడలేరు. ఛలోక్తులు విసరలేరు. చమత్కారం మర్చిపోయారు. ఏ మాట మాట్లాడితే ఏ అపార్థానికి దారితీస్తుందోనన్న భయంతో ఎంతో ఆలోచించి తూచితూచి మాట్లాడతారు. వేసే ప్రతి అడుగూ జాగ్రత్తగా వేస్తారు. ఎక్కడ గోతులుంటాయో, పడిపోతామోనని వారి భయం. ఇదీ ఈ దేశం వారి జీవితం" అన్నాడు వృద్ధుడు గంభీరంగా.

"పిరికివాడికి క్షణంక్షణం చావే! మీ పౌరులిలా ఎందుకు భయపడతారు? ధైర్యంగా ప్రభుత్వాన్నె దిరించి, విప్లవం సాధించి స్వేచ్ఛను సంపాదించుకోవచ్చునుగా!" అన్నాడు విచిత్రుడు వృద్ధుడిని చూసి.

"స్వేచ్ఛను సంపాదించాలకోవాలంటే ముందు స్వేచ్ఛ గురించి తెలియాలి కదా! మా పౌరులకు స్వేచ్ఛ అంటే ఏమిటో తెలియదు" అన్నాడు వృద్ధుడు. ఆయన గొంతులో విచారం వినపడింది.

"నేను నమ్మను. స్వేచ్ఛ అంటే తెలియని మనుషులుండరు. ఇప్పుడు పడే భయముండక పోతే అదే స్వేచ్ఛ అని ఈ దేశం ప్రజలు గ్రహించలేరా?" అన్నాడు. ఆనందుడు కొంచెం చిరాగ్గా ముఖం పెట్టి.

"మా గురించి నీ కేమీ తెలియనట్లుంది.

అణుతేజ

ప్రజలందరికీ మీ ప్రభుత్వమే అన్ని సదుపాయాలు చూడగలదా?" అని అడిగాడు ఆనందుడాశ్చర్యంగా.

"మా దేశంలో కూడు, గుడ్డ, నీడ అందరికీ ఉన్నాయి" అని వృద్ధుడింకా ఏదో చెప్ప బోతుండగా మధ్యలో ఆపి —

"అయితే ఇంకేం? ప్రపంచంలో ఏ దేశమూ సాధించని అద్భుతాన్ని మీ దేశం సాధించింది. ప్రతి మనిషికీ కూడు, గుడ్డ, నీడ ప్రభుత్వం ఇచ్చిందంటే ఆపైన మనిషి తన శక్తి సామర్థ్యాలను బట్టి ఆస్తిని పెంచుకుంటూ పోవచ్చు - సంపా దించేది జాగ్రత్తగా నిల్వ వేసుకుంటే సరి!" అన్నాడు ఆనందుడు.

కానీ, నిల్వచేయడం ఆ దేశంలో నేరమని వృద్ధుడు చెప్పాడు. తన దేశం గురించి వృద్ధు డింకా ఇలా చెప్పాడు.

అక్కడ భూమి, నీరు అంతా ప్రభుత్వానిదే! కొంతమంది సమర్థులైన వ్యవసాయదారులను నియోగించి వారిచేత వ్యవసాయం చేయించి ఫలం ప్రభుత్వం తీసుకుంటుంది. నెలనెలా ఆ వ్యవసాయదారులకు కొంత వేతనం ముడు తుంది. ఇదే విధంగా దేశంలోని పరిశ్రమలన్నీ ప్రభుత్వానివే! పనివాళ్ళకు జీతాలిచ్చి లాభాలు ప్రభుత్వం తీసుకుంటుంది. పరిశ్రమలకు పోటీ లేదు కాబట్టి తయారైన వస్తువుల నాణ్యత అంతంత మాత్రంగా ఉంటుంది. అయినా వేరే దారి లేదు కాబట్టి పౌరులు వాటినే కొనుక్కుంటారు. అందువల్ల లాభాలు బాగుంటాయి. అంతేకాదు. ప్రజలెవ్వరూ డబ్బు నిల్వ చేసుకోకూడదు. ఏ

అందుకే ఇలాగంటున్నావు. స్వేచ్ఛ అంటే ఏమిటో ఎవరైనా ఊహించుకోవచ్చు. కానీ, బ్రతుకంటే ఇలాగే ఉంటుందనీ, ప్రపంచంలోని మనుషులందరూ ఇలాగే ఉంటున్నారనీ మా పౌరులు నమ్ముతున్నారు. ఎక్కడా లేని స్వేచ్ఛ తమకు కావాలని వారెలా అనుకోగ లరు?" అన్నాడు వృద్ధుడు విషాదంగా నవ్వుతూ.

"అంటే ప్రభుత్వం మీ పౌరులను ఆ విషయం నమ్మించిందన్నమాట. అందుకు కారణమేమిటి?" అన్నాడు విచిత్రుడు.

"మా పౌరులకు స్వంత ఆస్తి ఉండదు. స్వంత భూమి ఉండదు. స్వంతిల్లు ఉండదు. అన్నీ ప్రభుత్వమే సమకూర్చుతుంది..." అన్నాడు వృద్ధుడు.

"చిత్రంగా ఉందే! మొత్త దేశంలోని

నెల వేతనాన్ని ఆ నెలలోనే ఖర్చు పెట్టేయాలి. లేకుంటే మిగిలిన ఆ డబ్బును ప్రభుత్వం తనే తీసేసు కుంటుంది. లేదా అలాంటివారికి వేతనాన్ని తగ్గిస్తుంది.

డబ్బు దాచుకోవలసిన అవసరం కూడా ప్రజలకు లేదు. వారి అవసరాలన్నీ ప్రభుత్వం చూస్తుంది. భావి పౌరులయిన చిన్న పిల్లల చదువు సంధ్యలన్నీ ప్రభుత్వమే భరిస్తుంది. దేశంలో ఎన్నో పాఠశాలలూ, శిక్షణ కేంద్రాలూ ఉన్నాయి. పిల్లల అభిరుచిని బట్టి ప్రభుత్వం దేశానికి పనికివచ్చే చదువు వాళ్ళకు నేర్పుతుంది. శిక్షణను వాళ్ళకిస్తుంది. ప్రజలకు జబ్బు చేస్తే ఉచిత వైద్యశాలలున్నాయి. వికలాంగులకు, అసహాయులకు, ముసలివారికి ప్రభుత్వం ఊరికే తిండి పెడుతుంది.

విచిత్రుడీ వివరాలు వింటూ, "అబ్బ! ఇంత గొప్ప దేశముంటుందని కలలో కూడా ఊహించ లేదు. సామాన్యులైన ప్రజలు మూర్ఖులని నా అనుభవంలో తెలుసుకున్నాను. సామాన్యుల ఇబ్బందులకు కారణం చాలావరకూ వాళ్ళ మూర్ఖత్వమే! వాళ్ళకు స్వేచ్ఛ ఉంటే దురుపయోగం చేస్తారు. సమర్థుడైన ప్రభువు వాళ్ళ స్వేచ్ఛను సకల సదుపాయాలూ సమకూర్చినప్పుడు అదే వారికి శ్రీరామ రక్ష అవుతుంది" అన్నాడు వారి దేశాన్నిలా పొగుడుతూ.

విచిత్రుడింకా ఏదో అనబోయే వాడే! ఈలాగా పెద్ద చప్పుడు విని ఆగిపోయాడు. అటుగా చూస్తే కారాగారంలోని యువకుడు పిడికిలి బిగించి గోడను గుద్దుతున్నాడు.

వృద్ధుడు తను కూర్చున్న చోటనించే శాంతంగా, "తప్పు నాయనా! ఒకరి అజ్ఞానం నీలో ఆవేశాన్ని రేపకూడదు" అన్నాడా యువకుడి



నుద్దేశించి.

"నాది అజ్ఞానమా!" అన్నాడు విచిత్రుడు చిన్నబుచ్చుకుని.

"అజ్ఞానం కాకపోతే నీది మిడిమిడి జ్ఞానం. లేకపోతే మా పద్ధతులని ఇలా పొగుడుతావా?" అన్నాడు వృద్ధుడు.

"ప్రభుత్వం పౌరులందరికీ వసతులన్నీ ఏర్పాటు చేసింది. సకల సదుపాయాలు ఇచ్చింది. పిల్లల బాధ్యత కూడా తీసుకుంది. దుర్మార్గుల్నించి రక్షిస్తుంది. అసలు ఆస్తులే లేని మీ దేశంలో దొంగల భయమే ఉండదు. అందరికీ ఒకే రకం వస్తువులు సరఫరా అవుతూంటే ఎక్కువ తక్కువలనే బాధ మీకు ఉండదు.

ప్రతి పౌరుడు ఏ బాధ్యతా లేకుండా నిర్వి చారంగా, సుఖంగా రోజులు గడుపవచ్చు. ఇలాంటి పద్ధతిని పొగిడిన నాది మిడిమిడి జ్ఞానం అంటున్నారేమిటి?" అన్నాడు విచిత్రుడు అసహనంగా.

"అయితే నిన్నొక ప్రశ్న అడుగుతాను. సూటిగా సమాధానం చెబుతావా?" అనడిగాడు వృద్ధుడు విచిత్రుని వంక చూస్తూ.

"అడగండి!" అన్నాడు విచిత్రుడు కుతూహలంగా వృద్ధునివంక చూస్తూ

"చిన్నప్పుడు నీ తండ్రి నిన్ను అకారణంగా దండిస్తే - నీకేమనిపించేది?" అన్నాడు వృద్ధుడు విచిత్రుడి కళ్ళలోకి చూస్తూ.

"నేనే గనుక పెద్దవాడినైతేనా - అనిపించేది" అన్నాడు విచిత్రుడు తడుముకోకుండా.

"చాలా బాగా చెప్పావు. అంటే అర్థమేమిటి? తనకు జరిగే అన్యాయాల నెదుర్కోవాలంటే మనిషి ఎదగాలి. అంతేగా! పసిబాలురు తమకు జరిగే అన్యాయాల నెదుర్కోలేరు. మా దేశంలోని ప్రతి పౌరుడూ పసి బాలుడే - అర్థమయిందా?" అన్నాడు వృద్ధుడు.

విచిత్రుడు అర్థం కానట్లు ముఖం పెట్టాడు. ఆనందుడికి మాత్రం కొంత అర్థమయింది. మనిషి ఎదగాలంటే శరీరం పెరిగితే చాలదు. బుద్ధి వికసించాలి. అందుకు ప్రపంచ జ్ఞానం కావాలి. ప్రభుత్వం చెప్పేదే వింటూ, ప్రభుత్వం చెయ్యమన్నదే చేస్తూ ఇతర ప్రపంచం గురించి తెలియని మనిషి శారీరకంగా ఎంత ఎదిగినా అతడికి ప్రభుత్వం తల్లివంటిదవుతుంది.

అతడు తల్లి వేలు పట్టుకుని నడిచే పసిబాలుడే అవుతాడు.

"తమరెవరు స్వామీ?" అనడిగాడు ఆనందుడా వృద్ధుణ్ణి.

నేనొక రచయితను. నా బుద్ధి పదునుగా ఉండేది. నా చుట్టూ కనబడే ప్రకృతి సౌందర్యం చూస్తే నాలో కొత్త కొత్త ఊహలు వచ్చేవి. వాటిని అక్షరాల్లో పెడితే అవే కావ్యాలల్లాయి. నా చుట్టూ ఉండే మనుషుల మనస్తత్వాలను అర్థం చేసుకుని కథలు రాస్తే అందరికీ నచ్చాయి. ప్రభుత్వం నన్ను పిలిచి తన పద్ధతులను పొగుడుతూ కావ్యాలు, కథలు వ్రాయమంది. నేను నా బుద్ధికి తోచిన నిజాన్ని మాత్రమే వ్రాయగలను. ఒకరు చెప్పింది నాకు నచ్చునిదే ఒప్పుకోలేను. నా మనసుకు తోచిన మాట బయటకు చెప్పడానికి నేను భయపడను. నేను స్వేచ్ఛను ప్రేమించాను. ప్రేమిస్తాను. నీ స్నేహితుడు మెచ్చుకున్న ప్రభుత్వం నన్ను మెచ్చుకోకుండా ఇక్కడుంచింది. నాకిది తగిన స్థలమేనని మీ కనిపిస్తోందా?" అన్నాడు వృద్ధుడు.

అప్పుడు యువకుడు గొంతు విప్పాడు, "ప్రభుత్వం సమర్థవంతమే కావచ్చు. కానీ, సమర్థులవల్ల తప్పు జరుగకూడదని లేదుకదా! నాకు మా ప్రభుత్వ విధానాల్లో లోపాలు కనిపించాయి. వాటిని సోదరప్రజలందరికీ చెప్పాను. ఆ లోపాలను సవరించడం మానేసి మా ప్రభుత్వం నన్నిక్కడుంచింది. ఇది నాకు తగిన స్థలమే అనుకుంటున్నారా?"

అంతే! మూలగా కూర్చున్న బాలుడు కూడా ముందుకు వచ్చి, "నేను చాలా తెలివైనవాణ్ణి. ఏ చదువు చదివినా అందులో ప్రథముడిగా



ఉంటున్నాడు. కానీ, నాకు చదువంటే ఆసక్తి లేదు. నేను బొమ్మలు ఎంతో బాగా గీయగలను. అవి గీస్తే నా మనసుకు తృప్తిగా గొప్ప చిత్ర కారుణ్ణి కావాలని కోరిక. అది నా తప్పా? బొమ్మలు వేయడంవల్ల దేశానికి ప్రయోజనం లేదుట. అంతా నన్ను బొమ్మలుమాని చదువుకోమంటారు. నేను చదువుకోనని మొండికేశాను. చదువు కుంటానని ఒప్పుకునే దాకా నన్నిక్కడే ఉండమని తీసుకొచ్చారు. ఇక్కడకొచ్చి రెండునెల్లయింది. చదువుకంటే నాకిక్కడే బాగుంది. నాకిష్టమైన బొమ్మలు గీయవద్దంటే, నేను చావనైనా చస్తానుగానీ చదువు మాత్రం నాకొద్దు'' అన్నాడు.

''ముక్కుపచ్చలారని ఈ బాలుడు అప్పుడే చావు గురించి మాట్లాడుతున్నాడు. మా దేశం మీ దృష్టిలో గొప్పది కాకేం?'' అన్నాడు వృద్ధుడు వెటకారంగా.

''బహుశా నావల్ల పొరపాటు జరిగిందేమో! నా ఆలోచనలో తప్పుందేమో - మీరెంత కాలంగా ఈ కారాగారంలో ఉంటున్నారు?'' అని వృద్ధుడిని విచిత్రుడు సంజాయిషీ అడిగినట్లుగా అడిగాడు.

''నేనెంత కాలం నుంచి ఉంటున్నానో లెక్క తెలియదు. కానీ, ఈ యువకుడిక్కడకు వచ్చి ఆరుమాసాలయింది. తను వచ్చి రెండు మాసాలయిందని ఈ బాలుడు చెప్పనే చెప్పాడుగా'' అన్నాడు వృద్ధుడు.

''ఇక్కడ ఎంత కాలముండాలి?'' అన్నాడు విచిత్రుడు.

''మాలో మార్పు వచ్చేదాకా!'' అన్నాడు యువకుడు విచారంగా.

''మీలో మార్పు వచ్చిందని మీ ప్రభుత్వానికెలా తెలుస్తుంది?'' అనడిగాడు విచిత్రుడు కుతూహలంగా.

''ఈ కారాగారంలో మనం మాట్లాడుకునే మాటలన్నీ వినడానికి ఏర్పాట్లున్నాయి ప్రభుత్వానికి. ఈ దేశంలో ప్రజలకు ఏకాంతంలో కూడా రహస్య ముండదు'' అన్నాడు యువకుడు.

ఇది వింటూనే ఆనందుడు, విచిత్రుడు ముఖముఖాలు చూసుకున్నారు. ఈ కారాగారం తలుపులు తెరుచుకుని బయటిప్రపంచంలోకి అడుగుపెట్టేదాకా తామెక్కడికీ వెళ్ళలేరు. ఇక్కణ్ణించి బయటపడాలనుకుంటే అందుకు ఉపాయముంది. తాము మాట్లాడే ప్రతి మాటా జాగ్రత్తగా ఆలోచించి వాడకపోతే తామిక్కడ శాశ్వతంగా బందీలు

కాగలరు.

"ఈ కారాగారంలో మీకేం సుఖం? మీ అభి ప్రాయాలు మీ మనసుల్లోనే దాచుకుని ప్రభుత్వం చెప్పినట్లు చేసి సుఖంగా బయట రోజులు వెళ్ళబుచ్చవచ్చును కదా!" అన్నాడు విచిత్రుడు.

"మనసులోని మాట స్వేచ్ఛగా బయటకు చెప్పుకోలేకపోయాక మనమిక్కడుంటేనేం, ఎక్కడుంటేనేం? తిండి అక్కడ దొరికినట్లే ఇక్కడా దొరుకుతుంది. పైగా ఇక్కడ నిర్భయంగా మాట్లాడుకునేందుకు నా కొత్త మిత్రులు కూడా ఉన్నారు. వీళ్ళొచ్చేక నాకిక్కడే ఎక్కువ బాగుంది -" అన్నాడు వృద్ధుడు.

"అలాంటప్పుడు మీ ప్రభుత్వం మిమ్మల్నందర్నీ కలిపి ఎందుకుంచారు?" అన్నాడాశ్చర్యంగా.

"ఏం చేస్తారు? క్రమంగా మా వంటి వారి సంఖ్య పెరుగుతోంది. అలాంటి వారితో కారాగారాలు నిండిపోతున్నాయి మరి! ఏదో రోజున ప్రజావిప్లవం ఈ దేశాల ఇనుప తెరలను బద్దలు కొట్టేదాకా మేమిలా కారాగారాల్లో మ్రగ్గుతూనే ఉంటాం -" అని, ఇంతకూ మీరెవరు?" ఏ దేశస్థులు అన్నాడు వృద్ధుడు.

ఆనందుడు తమగురించిన నిజం చెప్పి, "మీరెన్ని చెప్పండి. మా విచిత్రుడి ఊహ పొరపాటు కాదనిపిస్తోంది. మీ దేశం పద్ధతి మాకెంతో నచ్చింది. మాదేశానికి తిరిగి వెడితే ఇదే వ్యవస్థ నక్కడ ప్రవేశపెడతాం" అన్నాడు

అతడలా ఎందుకన్నాడో వెంటనే విచిత్రుడికర్థ మయింది.

కాసేపటికే అక్కడికొక మనిషి వచ్చి కారాగారం తలుపులు తెరిచి మిత్రులిద్దర్నీ చూసి, "మీరు శత్రుదేశపు గూఢచారులని మాకు నమ్మకం

కుదిరింది. మిమ్మల్ని సోదా చేసి కొన్ని ప్రశ్నలు వేయాలి. నాతో బయల్దేరి రండి!" అన్నాడు.

"ఈ నిర్ణయం మమ్మల్ని కారాగారంలో వేసే ముందే తీసుకోవచ్చుగా" అన్నాడు విచిత్రుడు చిరాగ్గా.

"విదేశీయుల విషయంలో మేము చాలా జాగ్రత్తగా ఉంటాం. మిమ్మల్ని శిక్షించినా మా దేశానికి ప్రమాదం లేదని తేలేదాకా మేము మీ జోలికి రాము. మీ విషయంలో త్వరగానే ఒక నిర్ణయానికి వచ్చాం. మీకు చావు మూడినట్లే ఉంది. నాతో రండి" అన్నాడా మనిషి.

విచిత్రుడు, ఆనందుడు బయటకు వచ్చారు. ఆ మనిషి కారాగారం తలుపులు తిరిగి తాళం వేసి తను ముందుకు నడుస్తూ వాళ్ళను తన్ననుసరించమన్నాడు.

మిత్రులిద్దరూ ఆ మనిషితో వెళుతూ కారాగార వాసులకు వీడ్కోలు చెబితే, వాళ్ళు విచిత్రుడినీ, ఆనందుణ్ణీ జాలిగా చూచారు.

ఆ మనిషి ముందు, మిత్రులిద్దరూ వెనుక అలా వారు ముగ్గురూ నడుచుకుంటూ విశాలమైన నడవలోకి చేరుకున్నారు. ముందు మనిషి మాత్రం అలాగే ఇంకా ముందుకు వెళుతున్నాడు.

అప్పుడు ఆనందుడు విచిత్రుడి చెయి పట్టుకున్నాడు. అందులోని అంతరార్థం విచిత్రుడి కర్థమయింది. ఇద్దరి చేతివ్రేళ్ళూ పరస్పరం ఒకసారే పనిచేసి ఉంగరాల రాళ్ళను తిప్పాయి. అంతే! వాళ్ళిద్దరికీ అదృశ్యరూపం వచ్చేసింది. అయినా అడుగుల చప్పుడు వినబడుతూండడంవల్ల ముందున్న మనిషికీ విషయం తెలియలేదు. కాసేపటికి ఎందుకో వెనక్కు తిరిగి మిత్రులిద్దరూ కనబడకపోయేసరికి అమాంతం కొయ్యబారి పోయాడు వాడు.

వాడిని చూసి తమలో తామే నవ్వుకుంటూ అదృశ్యరూపాలలో ఒకరిచేయి ఒకరు విడువకుండా చప్పుడు చేయకుండా మిత్రులిద్దరూ ఆ భవనంలోంచి బయటపడ్డారు..... (ఇంకా ఉంది)



సన్న్యాసి కోరిక



రుద్రకుడనే సన్న్యాసి సంతలో నడుస్తున్నాడు. అక్కడ మిఠాయి అంగడిని చూడగానే వాడికి నోరూరింది.

సన్న్యాసి అంగడి ముందాగి, "నాయనా! మిఠాయి తినాలనుంది. ఇస్తావా?" అనడిగాడు.

ఆ దుకాణం సీమన్నది. వాడు సన్న్యాసి వంక ఎగాదిగా చూసి, "నాలో దానగుణం ఏ కోశానా లేదు. డబ్బులిస్తే అందుకు తగ్గ మిఠాయివ్వగలను" అన్నాడు.

రుద్రకుడు దీనంగా, "నా వద్ద చిల్లిగవ్వయినా లేదే!" అన్నాడు.

"ఉంటే మాత్రం, చిల్లిగవ్వలు నేనేం చేసుకుంటాను. ఇంకెక్కడైనా దానగుణమున్నవాడు దొరికితే చూడు. ఉత్తినే ఇస్తాడు" అన్నాడు సీమన్న వేళాకోళంగా.

"నన్నీ మిఠాయిలే ఆకర్షించాయి. నేనివే తింటాను. నువ్వు పెట్టేదాకా నేనిక్కణ్ణించి కదలను" అని రుద్రకుడక్కడే బైఠాయించాడు.

సీమన్నకేం చేయాలో పాలు పోలేదు. సన్న్యాసిని మెడపట్టి గెంటుదామా అంటే వాడికేమి శక్తులున్నాయో? వాడు తనను సర్వనాశనం కమ్మని శపిస్తే ఏం కాను?

పోనీ అని సన్న్యాసికి ఉత్తినే మిఠాయి పెడితే రేపట్నుంచి అడ్డమైన వాడూ తన దుకాణం ముందు బైఠాయించి మిఠాయి అడిగితే ఏం చేయాలి? ఇలాంటి అలవాటు చేయడం మంచిది కాదు.

చూసీ చూడనట్లూరుకుందామా అంటే అక్కడ సన్న్యాసిని చూసినవారందరూ కారణాలడిగి తనను నిందిస్తారు. ఒక సన్న్యాసికి కాస్త మిఠాయి పెట్టలేవా అని అంతా తనకు నీతులు చెబుతారు. పైగా, సన్న్యాసి మంచి తేజస్సుతో ఉన్నాడు.

ఇలా పలు విధాల ఆలోచించి చివరికి సీమన్న సన్న్యాసిని దగ్గరగా పిలిచి, "అయ్యా! నన్ను తప్పుగా అర్థం చేసుకోకు. రోజూ నా వంటకు కట్టెలు తెచ్చే వాడీరోజున రాలేదు. నీవు మా ఇంటికి వెళ్ళి పెరట్లో దుంగని కట్టెలుగా చీల్చి

కలగాన వెంకటరమణ

ఇస్తే అందుకు కూలీగా నీకు మిఠాయి పెట్టగలను" అన్నాడు.

రుద్రకుడు సరేనని సీమయ్య ఇంటికి వెళ్ళి కొద్ది గంటలసేపు కట్టెలు కొట్టాడు. వాడికీ పని అలవాటు లేకపోవడం వల్ల చేతులు బొబ్బలెక్కాయి. వళ్ళంతా పచ్చి పుండయింది. అయినా పని పూర్తి చేసి ఆనందంగా మిఠాయి అంగడికి వెళ్ళి జరిగింది చెప్పాడు.

సీమయ్యకు సన్యాసిని చూస్తే జాలేసింది. వాడు మామూలుగా రావలసినదాని కంటే కాస్త ఎక్కువగానే మిఠాయిలు రుద్రకుడికిచ్చి, "తృప్తిగా తిను" అని చెప్పాడు.

అప్పుడు రుద్రకుడు దరిదాపుల్లో ఉన్న పిల్లలందర్నీ పిలిచి వాళ్ళందరికీ సమంగా మిఠాయిలు పంచి పెట్టాడు. తను చిన్న పలుకు కూడా రుచి చూడలేదు.

సీమయ్య ఆశ్చర్యపడి సన్యాసిని పిలిచి, "నువ్వు మిఠాయి కావాలన్నది నీ కోసమా, పిల్లల కోసమా? నీ కోసమే అయితే ఒక్క పలుకు కూడా ఎందుకు తినలేదు? పిల్లల కోసమే అయితే రోజంతా వళ్ళు హూనమయ్యేటంత శ్రమ ఎందుకుపడ్డావు?" అనడిగాడు.

రుద్రకుడు నవ్వి, "నాయనా! నీ మిఠాయిని చూడగానే అది తినాలన్న కోరిక నాలో పుట్టింది. సన్యాసినైన నాలో కోరిక ఉండకూడదు. ఆ కోరికను చంపడం కోసమే నిన్ను మిఠాయి కావాలని అడిగాను. కానీ నీవు ఇవ్వలేదు. అందుబాటులో లేదు కాబట్టి కోరికను చంపుకోవాలన్న భావం నాలో కలక్కుండా ఉండడానికి రోజంతా కష్టపడి ఆ మిఠాయి సంపాదించాను. సంపాదించిన మిఠాయిని పిల్లలకు పంచి పెట్టానంటే నేను నా కోరికను జయించినట్లే కదా! కోరికను జయించాలన్న కోరిక తప్ప మరే కోరికా నాలో ఉండకూడదని ఇదంతా చేశాను. అర్థమయిందా?" అని సీమయ్యకు చెప్పి, ఆ సన్యాసి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.



దాతృత్వం

పోటిలేని మేటి విలుకాడనిపించుకోవాలని అర్జునుడి కోరిక అందుకు కర్ణుడు సవాలయ్యాడు. అయితే కర్ణుడు శాపగ్రస్థుడు. అందువల్ల అతడి కంటే తనే గొప్ప అని అర్జునుడు అనుకునేవాడు.

ఈలోగా కర్ణుడు మహాదాత అని పేరు తెచ్చుకున్నాడు. అతడి పేరిట దానకర్ణుడన్న సామెత వచ్చింది. అన్నింట్లోనూ కర్ణుణ్ణి మించాలనుకునే అర్జునుడు దానకర్ణుడి బదులు దాన అర్జునుడన్న నానుడి ప్రజలనోట పలకాలని కోరుకున్నాడు. అతడు తన మనసులోని మాటను శ్రీకృష్ణుడికి చెప్పుకున్నాడు.

"దాతృత్వం సహజగుణం. దాతకు పేరు గురించి కాంక్ష ఉండదు. దానం తీసుకునేవాడి పాత్రత గురించిన ఆలోచన ఉండదు. డబ్బు మీద మమకారం ఉండదు. నీవు సహజంగా విలుకాడివి. దాంతో తృప్తిపడు. దాతను కావాలని కలలు కనకు. అది నీవల్ల కాదు" అన్నాడు శ్రీకృష్ణుడు. బావ తనను చిన్నబుచ్చాడని అర్జునుడు బాధపడి, "కర్ణుడేమైనా కష్టపడి సంపాదించిన సొమ్ము దానం చేస్తున్నాడా? దుర్యోధనుడి కారణంగా అయాచితంగా కొంత డబ్బు వచ్చింది. అది ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేస్తున్నాడు. నువ్వు తలచుకుంటే నేను అంతకంటే గొప్పగా దానాలు చేయగలను" అన్నాడు.

అర్జునుడికి గుణపాఠం చెప్పాల్సిన సమయం వచ్చిందని శ్రీ కృష్ణుడు గ్రహించాడు. అతడు వెంటనే అర్జునుణ్ణి తనతో తీసుకుని ఒకచోటుకు వెళ్ళాడు. అక్కడ మిలమిల, ధగధగా మెరిసిపోతున్న రెండు కొండలు కనిపించాయి. ఒకటి వెండిది. రెండవది బంగారపుది.

"ఈ రెండు కొండలూ నీవి. రేపు సూర్యోదయంలో ప్రారంభించి సూర్యాస్తమయంలోగా వీటిలోని వెండి, బంగారాలు దానం చేయాలి!" అన్నాడు శ్రీకృష్ణుడు. అర్జునుడు సరేనని మర్నాడు తను వెండి, బంగారు దానం చేయబోతున్నట్లు రాజ్యమంతటా చాటింపు వేయించాడు.

డి. మధుకుమార్

మర్నాడుదయానికి అర్జునుడిచ్చే దానానికి జనం విరగబడ్డారు. అడిగినవారికి లేదనకుండా అడిగినంతా దానంగా ఇస్తున్నాడు అర్జునుడు. మధ్యాహ్నానికి జనం పలచనయ్యారు. కానీ ఎంతిస్తే మాత్రం కొండలు తరుగుతాయా?

సాయం సమయానికి జనం లేరు. కొండలించు మించు అలాగే ఉన్నాయి. ఆ సమయానికి శ్రీకృష్ణుడలా వచ్చి, "ఏం అర్జునా? సూర్యాస్తమయం కావస్తోంది. నీ దాతృత్వమెంతవరకు వచ్చింది?'' అని నవ్వుతూ అడిగాడు.

''ఈ కొండలు ఒక్క రోజులో కరగవు. కర్ణుడైనా వీటిని ఒక్కరోజులో దానం చేయలేడు. నువ్వు నన్ను మోసం చేశావు. నామటుక్కు నేను గొప్ప గానే దానలు చేశాను. పుచ్చుకున్నవాళ్ళందరూ సంతోషించారు'' అన్నాడు అర్జునుడు.

నువ్విలాగంటావని నాకు తెలుసు. అందుకే ఇదే విషయం కర్ణుడికీ చెప్పాను. ఒక్క రోజుకు మాత్రం ఆరెండు కొండలు నీవి. సూర్యాస్తమయం లోగా వాటిలోని వెండి, బంగారం దానం చేయ గలిగితే చేయి అని చెప్పి వస్తున్నాను. చూద్దాం ఏం జరుగుతుందో?'' అన్నాడు కృష్ణుడు.

ఇంతలో కర్ణుడు ఇద్దరు మనుషుల్ని వెంట బెట్టుకుని అక్కడకు వచ్చి, ''చాలా కాలంగా మీరు నావద్ద నుంచి ప్రతీ రోజూ దానం తీసు కుంటున్నారు. ఈ రోజుతో మీ దరిద్రం తీరి పోతుంది'' అంటూ ఒకడికి వెండి కొండనూ, మరొకడికి బంగారపు కొండనూ ఇచ్చేసి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

''సూర్యాస్తమయం తర్వాత ఈ కొండలు తనక్కాకుండా పోతాయని తెలిసేక కర్ణుడు వాటినెవరికో ఒకరికిచ్చేశాడు. నీవు నీకిచ్చిన అధికారాన్ని చూస్తూ చూస్తూ వదులుకోలేకపోయావు. అదే మీ ఇద్దరికీ తేడా'' అన్నాడు కృష్ణుడు.

కర్ణుడికి వచ్చిన ఆలోచన తనకు రానందుకు సిగ్గుపడుతూ తల వంచుకోవడం మినహాగా మరేమీ చేయలేకపోయాడు. అర్జునుడు.

చెరువుమీద అలిగి కాళ్ళు కడుక్కోనట్లు....

సామెత కథలు

కిరణ్ ఎప్పుడూ క్లాసులో ఫస్టుగా వచ్చేవాడు. ఒకసారి వాడికి పరీక్షలముందు జ్వరం వచ్చింది. ఇంట్లో అంతా వాడిని బడికి వెళ్ళొద్దన్నారు. అయినా వాడు పట్టుదలగా పరీక్షలు వ్రాశాడు.

ఈసారి కిరణ్‌కి అన్నింట్లోనూ తక్కువ మార్కులు వచ్చాయి. తోటి విద్యార్థులందరూ వాడిని, "మొద్దబ్బాయి.... మొద్దబ్బాయి" అంటూ వెక్కిరించారు.

వాడి క్లాసు టీచరు కూడా అసలు విషయం తెలుసుకోకుండా, "ఇంతకాలం నువ్వు బుద్ధిగా చదువుకునేవాడివి. ఇప్పుడు నీకు కళ్ళు నెత్తికెక్కినట్లున్నాయి. లేకుంటే ఇన్ని తక్కువ మార్కులు రావు. ఒకసారి చెడుదారి పట్టావో - ఇంక బాగుపడవు, జాగ్రత్త!" అని నానా విధాలుగా తిట్టి, వాడు చెప్పేది వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు. ఆ తర్వాత తోటి విద్యార్థులు కిరణ్‌ని మరింతగా ఏడిపించారు.

కిరణ్ ఇంటికి వెళ్ళి "నేనిక బడికి వెళ్ళను. చదువుకోను. అక్కడి విద్యార్థులన్నా టీచర్సన్నా నాకు కోపం" అని చెప్పాడు.

అప్పుడు వాడి తల్లి జరిగిందంతా తెలుసుకుని, "ఏడిసినట్లుంది. చెరువుమీద అలిగి కాళ్ళు కడుక్కోనన్నాట్ట నీలాంటివాడే! అందువల్ల ఎవరికి నష్టం? నీకు మార్కులు తక్కువ రావడానికి కారణం జ్వరం. ఈసారి పరీక్షల్లో బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుని నిన్ను చూసి నవ్వినవాళ్ళచేతే పొగడ్తలు పొందాలి. చదువు మానేస్తే అందువల్ల పనికి రాకుండా పోయేది నువ్వే!" అని మందలించింది.

కిరణ్‌కి అసలు విషయం అర్థమై - తన తొందరపాటుకీ, అర్థంలేని కోపానికీ సిగ్గుపడ్డాడు. తర్వాతి పరీక్షల్లో మళ్ళీ వాడే క్లాసుకంతకీ ఫస్టుగా వచ్చాడు.

జ్యోతిర్మయి

మార్చి నెల

బొమ్మల సంభాషణ ఫలితాలు



కొడుకు: నాన్నగారూ మీరిక మీ ఆఫీసులో తలదించుకోవాల్సిన అవసరంలేదు. నాతోపాటు మీ మేనేజర్ కొడుకు కూడా పరీక్ష తప్పాడు!!

తండ్రి: ఆ!!!!

— దాసరి విజయభాస్కర్, చీరాల.

కొడుకు: నేనలా మమ్మీకి కాస్త ఒంట్లో బాగా లేదన్నానో లేదో! అలా తెల్ల ముఖం వేశావేంటి నాన్నా?!

తండ్రి: ఇక వంట నేనేగా చేయాల్సింది!

— ఊకాటి అనితా, తలువూరు.

తండ్రి: బడ్జెటికి ముందే బియ్యం, గోధుమల ధర పెంచారు కానీ రేపు బడ్జెట్‌లో 'కాస్మెటిక్ ధరల తగ్గింపు' అని పేపరులో వస్తుందని ఆశిద్దాం!

కొడుకు: మింగ మెతుకులేదు, మీసాలకు సంపెంగనూనె ఎందుకు పితాజీ!!

— కె. గాయత్రీ, సన్నిపాంట.

తండ్రి: ఏరా! 'కాన్వెంటుకా?' అయితే పుస్తకాలన్నీ ఏవి?

కొడుకు: పుస్తకాలన్నీ 'బండిలో' పంపించా! ఇదిగో పుస్తకాల 'లిస్ట్' మాత్రం నా దగ్గరుంది!!

— ఎం. తారకేశ్వరరావు, సోంపేట.

కొడుకు: పరీక్ష ప్యాసవుతాననే నమ్మకం నాకుంది! కానీ మీరు ప్రయత్నం చేస్తే ర్యాంకు రావడం ఖాయం డాడీ.

తండ్రి: అది నా విధి. నువ్వు ప్రత్యేకంగా చెప్పడమెందుకురా వెర్రి నాగన్నా!

— వి. ప్రవీణ్ కుమార్, వరంగల్.

ప్రశ్నలు జవాబులు



ప్రశ్న: ఎక్కువగా నీళ్ళు తాగతె జబ్బు చేస్తుందా?

జవాబు: ఆరోగ్యవంతుడైన మనిషికి సాధారణంగా రోజుకి 2½ నుంచి మూడు లీటర్ల నీళ్ళు తాగడానికి కావాలి. నీటి అవసరం మనిషికి దాహం రూపేణా తెలుస్తుంది. దాహం లేనప్పుడు కనుక ఒక్కసారిగా ఒకటిన్నర లీటర్ల నీళ్ళు తాగితే మూత్రపిండాలకు పని పడుతుంది. అధికంగా తాగిన నీటిలో 75 శాతం రెండు గంటలలోగానూ, 90 శాతం నాలుగు గంటలలోనూ మూత్రరూపేణా విసర్జించ బడుతుంది. అయితే మూత్రపిండాలు నిముషానికి 16 మిల్లీ లీటర్ల కంటే ఎక్కువ మూత్రాన్ని తయారు చేసి విసర్జించలేవు. అందువల్ల ఎనిమిది నుంచి పన్నెండుదాకా లీటర్ల నీళ్ళు తాగిన మనిషి శరీరంలో నీరెక్కువగా ఉండి పోయి రక్తం, రక్తంలోని సోడియం విలువ పలచబడిపోతాయి. శరీరంలోని ఎన్నో కణాలు నీటిని పీల్చుకుని ఉబ్బసం వల్ల తలనొప్పి, కళ్ళుతిరగడం వంటి వాటితో ప్రారంభమై స్పృహతప్పడం, చావు దాకా దారితీసే ప్రమాదముంది. అవసరానికి మించి అపరిమితంగా నీళ్ళు త్రాగడంవల్ల.

ప్రశ్న: బొమ్మ మాయమయేటప్పుడు టెలివిజన్లో నెగెటివ్‌లా కనబడుతూంటుంది. కారణం?

జవాబు: ఒక బ్లాక్ అండ్ వైట్ బొమ్మను తదేకదీక్షతో పరిశీలించి చూసేక వెంటనే తెల్ల కాగితాన్ని చూస్తే ఆ బొమ్మ నెగెటివ్‌లా కనబడుతుంది. అందుకు కారణం కంటిలోని రెటీనా వెంట వెంటనే జరిగే ఇలాంటి మార్పుల విషయంలో తీసుకునే రవ్వంత వ్యవధి! మన కంటికున్న పరిమితులు తెలుసుకోవడం ఎంతైనా ముఖ్యం! టెలివిజన్లో బొమ్మ మాయం కాగానే కూడా వెంటనే బుల్లి తెర వెండి తెర అవుతుంది కదా మరి!

ప్రశ్న: వానకు సిరా చెదిరిపోతుంది. తోటలో లేబుల్సు పెట్టాలంటే ఎలా వీలవుతుంది?

జవాబు: ఇంట్లో తప్పకుండా పాత కొవ్వొత్తులుంటాయి. తోటలో ఉంచడానికి రాసే

లేబుల్సు మీద సిరాతో అక్షరాలు వ్రాసేక కొవ్వొత్తితో వాటి మీద రుద్దండి. అంతే ఆ అక్షరాలు వాటర్ ప్రూఫ్ అయిపోతాయి. వానొచ్చినా చెదరవు. మొక్కలకు బదులు లేబుల్సుకు నీళ్ళు పోసిన చెరగవు. ఈ కొవ్వొత్తిని మీరు వ్రాసే ఉత్తరాలకు కూడా వాడవచ్చు.

ప్రశ్న: రిస్టువాచీలో జ్యూయెల్సు ఎందుకు?

జవాబు: రిస్టు వాచీలో ఒకదానిపై ఒకటి ఆధారపడి తిరిగే విధంగా ఎన్నో చక్రాలుంటాయి. వాటిలో బ్యాలన్సు వీల్ ఆగకుండా ముందుకూ వెనక్కూ తిరుగుతూ మెయిన్ స్ప్రింగ్‌ను అదుపు చేస్తుంది. ఈ చక్రాలన్నీ ఒక ఆధారంపై నిలబడాలి. కదా! ఆ ఆధారాలకు పైనా క్రిందా జ్యూయెల్స్‌నుంచుతారు. కృత్రిమంగా తయారైనా ఈజ్యూయెల్సులో వజ్రం తర్వాత వజ్రమంతటివి. వీటిని ఎంతైనా పాలిష్ చెయ్యవచ్చు కాబట్టి నున్నగా ఉండి ఘర్షణ ఉండదు. వాటిపై పడ్డ ఆయిల్ చుక్కలు ఇంకిపోవు. నిత్యమూ కదులుతుండే ఆధారాలకు ఘర్షణ లేకుండా సహకరించే ఈ జ్యూయెల్స్ ఎన్నేళ్ళయినా అరక్క పోవడం మరో విశేషం.

ప్రశ్న: ట్వయిన్ దారాన్ని గోరు వెచ్చని నీటిలో తడిపి ఆ తర్వాత పార్సిల్సు ముడి వేయడానికి ఉపయోగిస్తారు ఎందువల్ల?

జవాబు: ట్వయిన్‌దారం గోరువెచ్చని నీటిలో ముంచినప్పుడు కొద్దిగా ఉబ్బి మొత్తబడుతుంది. అప్పుడు దాన్ని పారిల్సు చుట్టూ బిగించి ముడివేయడానికి అనువుగా ఉంటుంది. ఆ తర్వాత దారం నెమ్మదిగా ఎండి కుచించుకుపోతుంది. అప్పుడది బిగుసుకుని పార్సిల్ని గట్టిగా పట్టి ఉంటుంది.

బొమ్మల సంభాషణ

ఈ బొమ్మలోని వాళ్ళు ఏం మాట్లాడుకుంటే నవ్వు వస్తుందో, ఆ సంభాషణ వ్రాసి, ఈ సంచిక విడుదలైన పది రోజులలోగా మాకు పంపకోరుతున్నాం. బాగున్న అయిదింటిని ఎన్నుకొని, ఒక దానికి రూ. 15/- పంపుతాం. సంభాషణలు కార్డు మీద మాత్రమే వ్రాసి పంపాలన్నది షరతు.

బొమ్మల సంభాషణ
80, ధనలక్ష్మీ కాలనీ, వడపళని, మద్రాసు-26

Edited and published by Vijaya Bapineedu, 80, Dhanalakshmi Colony, Madras-26, Phone:422233 and Printed by N. Navin Chandran, at S.R. Offset Art Printers, Madras-21, Phone:526462.